ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కాకినాడ
జిల్లా వార్తలు
శనివారం 5 ఏప్రిల్ 2025 | 5





అద్భుతః

- అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన 6
- వందలాది పెయింటింగ్స్, ఆకృతులు
- పెన్సిల్ ఆర్ట్ నుంచి సిలికాన్ విగ్రహాల వరకూ
- పలు రాష్ట్రాల నుంచి కళాకారులు
- కళలకు పునరుజ్జీవం : డిప్యూటీ స్పీకర్ రఘురామ
- కళాకారులకు పూర్వ వైభవం : మంత్రి దుర్గేష్


రాజమహేంద్రవరంలో.. చిత్రకళా వీధిలో..


అమరావతి చిత్రకళా వీధి కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ, మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి, బత్తుల, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు

కళాకారుల సృజనాత్మకత కుంచెగా మారి జాలువారిన చిత్రాలు, ఆలోచనలకు రూపమిచ్చిన ఆకృతులతో, ఒడుపుగా రావి ఆకులో ఇమిడ్చిన స్వతంత్ర సమరయోధుల చిత్రాలు, కోడిగుడ్డు గుల్లలు, వేరుశనగ తొక్కలు.. ఇలా ఒకటేమిటి.. ఎన్నెన్నో వస్తువులతో జీవం పోసుకున్న కళారూపాలు.. మొత్తంగా అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన బౌరా! అనిపించింది. గోదావరి తీర నగరాన్ని పులకింపజేసింది. కళకు కాదేదీ అనర్హం అని నిరూపించింది. కళాకారులకు పూర్వ వైభవం తీసుకొచ్చే సదుద్దేశంతో రాష్ట్ర సాంస్కృతిక శాఖ రాజమహేంద్రవరంలో ఏర్పాటుచేసిన ఈ వేడుకలో కళాకారులు తమ కళాఖండాలను ప్రదర్శించారు.


ఇటీవల తాము వేసిన వేషధారణలతో వేసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న రఘురామకృష్ణంరాజు, దుర్గేష్, పక్కన ఎమ్మెల్యే ఆదిరెడ్డి, తేజస్వి


చిత్రకళా వీధిలో ప్రదర్శనలు.. సెంట్రల్ జైలు స్టాల్ వద్ద స్వాగతం




తన రక్తంతో గీసిన పవన్ చిత్రాన్ని రఘురామకు చూపిస్తున్న ఆర్టిస్ట్




కళ.. కళాకారులు

అయ్యో.. రొయ్యో..!


ఆక్వా చెరువులు... వనామీ రొయ్యలు పడుతున్న దృశ్యం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆక్వా రైతుల్లో వణుకు పుట్టిస్తున్నాడు. భారత్ సహా వివిధ దేశాల నుంచి అమెరికాకు ఎగుమతి సుంకాలు భారీగా పెంచుతున్నట్టు చేసిన ప్రకటనతో రొయ్యల ఎగుమతిదారులు కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేశారు. దాని ఫలితంగా ఆక్వా రైతులు పండించే ఉత్పత్తులపై తీవ్రమైన ప్రభావం పడింది. ఉత్పత్తి అయ్యే రొయ్యలను సైతం ఎగుమతిదారులు ధరలు తగ్గించి కొనుగోలు చేసే ప్రతిపాదనలు రైతులకు శరాఘాతంగా మారింది. ప్రకటన చేసిన కొన్ని గంటల్లోనే ఎగుమతి సుంకాలు పెంచేశారన్న ప్రచారం ప్రభావంతో భారత్‌లోనే అత్యధిక ఆక్వా ఉత్పత్తుల్లో అగ్రగామిగా ఉండే ఆంధ్రప్రదేశ్‌లో కొనుగోళ్లు నిలిపివేయడం వల్ల ధరలు గణనీయంగా తగ్గిపోయి రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. 50 కౌంట్ నుంచే అమెరికాకు రొయ్యల ఉత్పత్తుల ఎగుమతులు జరుగుతుంటాయి. అయితే దీన్ని సాకుగా తీసుకుని వంద కౌంట్ రొయ్యల ధరను భారీగా తగ్గించేశారు. కొన్ని రోజులపాటు ఆక్వా రైతులు, ఉత్పత్తులను పట్టుబడులు చేయడం నిలిపివేయాలంటూ కంపెనీలు ఆదేశించడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. అమెరికా సుంకాల భారాన్ని మోపడంపై వారంతా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

(అమలాపురం/మలికిపురం-ఆంధ్రజ్యోతి)

భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే ముఖ్యంగా వనామీ రొయ్యపై ఎగుమతి సుంకం విధించడంతో ఆక్వా రైతులు పండించే రొయ్యల ఉత్పత్తులను కొన్నిరోజులపాటు నిలిపివేయాలన్న ఎగుమతిదారుల నిర్ణయం రైతులకు తీవ్ర ఆందోళన కలిగించింది. దాంతో కిలో రొయ్యలకు రూ.40 వరకు ఎగుమతి సుంకం పడుతుందనే పేరుతో రొయ్యల కొనుగోళ్లు నిలిపివేశారు. ఏప్రిల్ 15 నుంచి రొయ్యల ధరలు మరింత తగ్గుతాయనే ప్రచారానికి తెర లేపారు. దాంతో రొయ్యల రైతులు ఉత్పత్తి అయిన వాటిని అయిన కాడికి అమ్ముకోవడానికి సిద్ధమయ్యారు. వ్యాపారులు మాత్రం సిండికేట్ అయి నోరు మెదపడం లేదు. ఆర్డర్లు చెప్పడం లేదు. దాంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఆక్వా రైతుల్లో ఆందోళన నెలకొంది. అధిక సాగు ఉన్న కోనసీమలో తీరప్రాంత మండలాల నుంచి ప్రతీ రోజు వేలాది టన్నుల రొయ్యలు వివిధ కంపెనీలకు ఎగుమతి అవుతాయి. రాష్ట్రంలోనే పేరొందిన ప్రముఖ కంపెనీలు ఈ ప్రాంతం నుంచి రొయ్యల కొనుగోలు చేస్తాయి. ట్రంప్ పేరుతో తమపై ఎగుమతి సుంకం పడుతుందనే నెపంతో ఎగుమతిదారులు ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నారని, ప్రస్తుతానికి కొనుగోలు నిలిపివేసినట్టు చెబుతున్నారు. ప్రస్తుతానికి కిలోకు రూ.20 నుంచి రూ.30 వరకు తగ్గించి రొయ్యలు కొనుగోలు చేస్తున్నారు. ధరలు మరింత తగ్గుతాయని ప్రచారం చేస్తూ రైతులను మానసికంగా సిద్ధం చేస్తున్నారు. 30 నుంచి 50 పైకౌంటు రొయ్యలు మాత్రమే అమెరికా, జపాన్ వంటి ఇతర దేశాలకు ఎక్కువగా ఎగుమతులు అవుతాయి. అయితే 80 నుంచి వంద కౌంటు వరకు రొయ్యలు ఎగుమతులకు పనికిరావని సాకుచూపి రేటు భారీగా తగ్గించి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం వంద కౌంటు రొయ్యలు రూ.220 ధరకు కొనుగోలు చేస్తుండగా, 90 కౌంట్ రూ.230, 80 కౌంట్ రూ.250, 70 కౌంట్ రూ.270, 60 కౌంట్ రూ.300, 50 కౌంట్ రూ.330, 40 కౌంట్ రూ.360, 30కౌంట్ రూ.450 ధరలు ఉండగా ఇవి మరింత దిగజారే అవకాశాలు ఉన్నాయని రైతులు తెలుపుతున్నారు. ప్రభుత్వం రొయ్యల రైతులకు భరోసా కల్పించాలని, అత్యధిక విదేశీ మారకద్రవ్యం ఆర్జించే పెద్ద రంగం ఆక్వా కాబట్టి ప్రభుత్వం ఆక్వా రైతులకు బాసటగా నిలబడాలని ఆక్వా అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు త్సవటపల్లి నాగభూషణం పేర్కొన్నారు. ప్రభుత్వం ఇస్తామన్న విద్యుత్ రాయితీలు వర్తింపచేయాలని, గత ప్రభుత్వంలో దారుణంగా పెంచిన రొయ్య ఫీడు ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కొనుగోలుదారులతో చర్చించి రొయ్యలు కొనే ఏర్పాట్లు చేయాలని కోరారు. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని ఆక్వా రైతుల్లోనూ ఇదే ఆందోళన నెలకొంది.

- ఆక్వా రంగంలో వణుకు పుట్టిస్తున్న ట్రంప్ ప్రకటన
- ఆక్వా రైతు నెత్తిన ఎగుమతి సుంకం పిడుగు
- ఆ సాకుతో రొయ్యల కొనుగోళ్లు ఆపేసిన ఎగుమతిదారులు
- కొన్ని రోజులపాటు కొనుగోళ్లు నిలిపివేయాలని నిర్ణయం
- విలవిల్లాడుతున్న రైతులు

కాకినాడ సాగరతీరంలో 8 నుంచి 13 వరకు

సైనిక విన్యాసాలు

- టైగర్ ట్రియంప్ విన్యాసాల విజయవంతానికి కృషి చేయాలి: కలెక్టర్


బీచ్‌లో ఏర్పాట్లను ఎస్పీతో కలిసి పర్యవేక్షిస్తున్న కలెక్టర్

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 8నుంచి 13 వరకు కాకినాడ సాగరతీరంలో నిర్వహించే టైగర్ ట్రియంప్-2025 సైనిక విన్యాసాల విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. శుక్రవారం రాత్రి కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్‌లో నావెల్ ఎన్‌క్లేవ్‌లో సైనిక విన్యాసాల నిర్వహణ కోసం జరుగుతున్న ఏర్పాట్లను ఎస్పీ బిందు మాధవ్, సైనిక అధికారులతో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విన్యాసాలు జరిగే ప్రాంతంలో స్టేట్ హైవే బ్లాకింగ్, బారికేడింగ్, ట్రాఫిక్ మళ్లింపు, క్రౌడ్ నియంత్రణ, సైనిక విన్యాసాల దృష్ట్యా ప్రవేశ అనుమతి ఉండదన్నారు. భారత్, అమెరికా వాయుసేనల సంయుక్తఆధ్వర్యంలో టైగర్ ట్రియంప్-2025 పేరిట ఉమ్మడి సైనిక విన్యాసాలు కాకినాడతీరంలోని నేవల్‌ఎన్‌క్లేవ్‌లో యాంఫీబియస్ విన్యాసాలు సముద్రంలోను, ఉపరితలంపైన జరుగుతాయన్నారు. ట్రైనీ ఐపీఎస్ సుస్మిత, డీఆర్వో జె.వెంకటరావు, సివిల్ మిలటరీ లైజాన్ అధికారి కమాండర్ వైకే కిషోర్, సైనిక అధికారులు ప్రసాద్, డీపీవో వి.రవికుమార్, ఫైర్‌అధికారి వీపీఎస్ రాజేష్, ఎంహెచ్ వో డాక్టర్ పృథ్వీ, ఎఫ్‌డీవో కృష్ణారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు 'కౌడా' రూ.4.73కోట్లు కేటాయింపులు

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కౌడా)నుంచి పలు అభివృద్ధి పనులకు రూ.4.73 కోట్ల నిధులను కేటాయించారు. కాకినాడ బీచ్ పార్క్ ఫ్రంట్ ఎలివేషన్ అభివృద్ధికి రూ.3.56కోట్లు, ఆర్డీవో జంక్షన్ అభివృద్ధికి రూ.50లక్షలు, పెద్దాపురం మున్సిపాల్టీలో అభివృద్ధి పనులకు రూ.40లక్షలు, పులిమేరు ఓపెన్ జిమ్ కోసం రూ.15లక్షలు, సామర్లకోట మున్సిపాల్టీలో అభివృద్ధి పనులకు రూ.5లక్షలు, సామర్లకోట శివాలయం అభివృద్ధికి రూ.5లక్షలు, బీచ్‌పార్క్ జనరేటర్‌కు రూ.2లక్షల నిధులను కేటాయించారు.

బీసీ స్వయం ఉపాధి యూనిట్ల మంజూరుకు కృషి చేయాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీసీలకు స్వయం ఉపాధి యూనిట్ల మంజూరుకు బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ కోరారు. జిల్లాలో వెనుకబడిన తరగతుల సేవాసంస్థద్వారా బీసీ, ఈడబ్ల్యుఎస్, కాపు కార్పొరేషన్ కింద రుణాల మంజూరుపై కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రుణాలకుగాను గత నెల 10నుంచి 25వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించగా 57వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకుని 11న రుణాలు మంజూరు చేస్తామన్నారు. వివిధ మండలాల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల లాగిన్‌ల నుంచి బ్యాంకర్లకు అందిన దరఖాస్తుల్లో 25శాతం దరఖాస్తులను 11న రుణాలు మంజూరు చేయాలన్నారు. డీఆర్వో వెంకట్రావు, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీసీసీబీ సీఈవో నరసింహారావు, ఎల్డీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

పెళ్లింట తీవ్ర విషాదం

- పెళ్లి షాపింగ్‌కి వెళ్లి వస్తుండగా యువకుడి మృతి 7

చీటీల సొమ్ముతో ఉడాయించిన మహిళ 7

- రూ.1.4కోట్ల మేర మోసం
- పిఠాపురం పోలీసులను ఆశ్రయించిన బాధితులు

ఇళ్ల పట్టాల్లో 3708మంది అనర్హులు: డీఆర్వో

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం జారీ చేసిన జగనన్న ఇళ్ల పట్టాల్లో ఇప్పటివరకు 3708మంది అనర్హులుగా గుర్తించామని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. గత ప్రభుత్వంలో జారీ చేసిన ఇళ్లపట్టాలపై రీసర్వే చేసి అనర్హులను గుర్తిస్తున్నామన్నారు. మొత్తంగా 1,41,817 పట్టాలు జారీ చేయగా 1,25,044మంది అర్హులుగా గుర్తించామన్నారు. 3708మంది అనర్హులుగా గుర్తించామన్నారు. మిగిలిన 13,065 ఇళ్లపట్టాలను మరో నాలుగైదు రోజుల్లో తనిఖీ చేసి అర్హుల వివరాలను తెలియజేస్తామన్నారు. ఆరంచెల విధానంలో సర్వే చేస్తున్నామని, రీసర్వే పూర్తి చేసిన తర్వాత నివేదికను ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు.

'భూముల క్రమబద్ధీకరణకు 270 దరఖాస్తులు'

జిల్లాలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు ఇప్పటివరకు 270 దరఖాస్తులు వచ్చాయని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. ఈనెల 10 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అర్హతఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. లేఅవుట్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహగట్లు, మాస్టర్‌ప్లాన్, జోనల్ ప్లాన్‌లో నిర్దేశితస్థలాలు, జలవనరులకు సంబంధించిన స్థలాల్లో క్రమబద్ధీకరణ చేయలేమన్నారు. 150గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామన్నారు. దారిద్ర్యరేఖకు దిగువనఉండి 150 నుంచి 300 గజాలలోపు ఆక్రమణకు చేసిన ధరలో 15శాతం, రిజిస్ట్రేషన్‌ఫీజులో 50శాతం చెల్లించాలన్నారు.

ఎమ్మెల్సీ నాగబాబుకు కలెక్టర్, ఎస్పీ ఘన స్వాగతం

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికై మొట్టమొదటిసారిగా కాకినాడకు విచ్చేసిన శాసనమండలి సభ్యులు కొణిదెల నాగబాబు శుక్రవారం కాకినాడ కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా కలెక్టర్ దంపతులు, జిల్లా ఎస్పీ ఆయన పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడ్కో చైర్మన్ అజయ్, పిఠాపురం నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసు పాల్గొన్నారు.


నాగబాబుకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

అభివృద్ధి పండుగ

- పిఠాపురం నియోజకవర్గంలో పలు ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ నాగబాబు
- తహసీల్దారు కార్యాలయం, యూపీహెచ్‌సీ ప్రారంభం


గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు, చిత్రంలో ఎమ్మెల్సీ హరిప్రసాద్, జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి, కలెక్టర్

పిఠాపురం/గొల్లప్రోలు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): శాసనమండలి సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం రాష్ట్రంలో తొలిసారిగా పిఠాపురం నియోజకవర్గంలో అధికారిక పర్యటనకు వచ్చిన కొణిదల నాగబాబు శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో నిధులు మంజూరై పూర్తయిన పనులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. గొల్లప్రోలు పట్టణంలో రూ88.98లక్షలతో నిర్మించిన అర్బన్ హెల్త్‌సెంటర్ భవనాన్ని శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన సౌకర్యాలను, ల్యాబ్, ఓపీ విభాగాన్ని పరిశీలించారు. కోటి రూపాయిలతో నిర్మించిన తహసీల్దారు కార్యాలయ భవనాన్ని నాగబాబు ప్రారంభించారు. కార్యాలయంలోని తహసీల్దారు సీటులో తహసీల్దారు సత్యనారాయణను కూర్చొబెట్టి అభినందించారు. గొల్లప్రోలు వాటర్‌వర్క్స్‌లో రూ.65.24లక్షలతో నిర్వహించిన పనులను ప్రారంభించి తాగునీటి పథకం పనితీరుపై ఆరాతీశారు. అనంతరం కూటమి నాయకులతో కలిసి మెయిన్‌రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్‌ను ప్రారంభించారు. మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. క్యాంటీన్‌లో పనిచేస్తున్న కార్మికులతో ముచ్చటించారు. కార్యక్రమాల్లో ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్, కౌడా చైర్మన్ తుమ్మలబాబు, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు పాల్గొన్నారు. కార్యక్రమానికి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ హాజరుకాలేదు. కార్యక్రమానికి వచ్చిన టీడీపీ నేతలు నాగబాబుకు అన్నక్యాంటీన్ వద్ద పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలకడం గమనార్హం.






మినియేచర్ ఆర్ట్‌ని భూతద్దంలో తిలకిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

అద్భుతః




ఆర్ట్‌ని తిలకిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి

'అమరావతి చిత్రకళా వీధి'లో ఆకట్టుకున్న వందలాది పెయింటింగ్స్, ఆకృతులు

పెన్సిల్ ఆర్ట్ నుంచి సిలికాన్ విగ్రహాల వరకు... చూసి ముగ్ధులైన ప్రజలు

రాజమహేంద్రవరం/సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శుక్రవారం జరిగిన 'అమరావతి చిత్రకళా వీధి' ప్రదర్శనకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి నుంచి కూడా కళాకారులు వచ్చారు. నగర కళాకారులతో పాటు కడప, శ్రీకాకుళం, విజయవాడ, తిరుపతి తదితర ప్రాంతాల వారు పెయింటింగ్స్, ఆకృతులను స్టాల్స్‌లో ఉంచారు. ప్రభుత్వాస్పత్రి దగ్గరనుంచి ఆర్ట్స్ కళాశాల వరకు రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటుచేసిన ప్రత్యేక స్టాల్స్ ఎక్రిలిక్, వాటర్ కలర్, పెన్, పెన్సిల్, నిబ్ పెయింటింగ్స్ చెక్క, మట్టి, కాగితం, వాల్‌పుట్టి తదితర ముడిసరుకులతో చేసిన బొమ్మలతో నిండిపోయాయి. చిరుధాన్యాలతో చేసిన ప్రధాని మోదీ, తిరుమల వేంకటేశ్వరుని చిత్రపటాలు, మనిషిని పోలిన మనిషి విగ్రహాలు ఆశ్చర్యపరిచాయి. మహిళా ప్రత్యేక కారాగారంలోని ఉత్పత్తులు, కేంద్ర కారాగారంలోని ఖైదీలు వేసిన గాంధీజీ తదితర పెయింటింగ్స్ ఆకర్షించాయి. కడపకు చెందిన ఈరయ్య యోగి వేమన యూనివర్సిటీలో పని చేస్తున్నారు. ఆయన ఇసుకతో చిత్రపటాలు తయారు చేశారు. పాండిచ్చేరికి చెందిన నూర్జహాన్ టైలరింగ్ షాపులు, వస్త్ర తయారీ మిల్లుల్లో వచ్చిన రద్దుతో చేతి సంచులు, మహిళలకు హ్యాండ్ బ్యాగ్స్ రూపొందించారు. తిరుపతికి చెందిన బి.అర్చన నిర్మల్ పెయింటింగ్‌తో ఆకట్టుకున్నారు. లైవ్ ఆర్ట్‌లో కళాకారులు అక్కడికక్కడే పెన్, పెన్సిల్‌తో చిత్రాలు వేసి ఇస్తుండడం చాలా మందిని ఆకర్షించింది. వారివారి చిత్రాలను వేయించుకుని మురిసిపోయారు. కొత్తపేటకు చెందిన రాజ్‌కుమార్ వడయార్ ఫ్యాబ్రిక్, సిలికాన్ మెటీరియల్‌తో చేసిన ప్రముఖుల విగ్రహాల వద్ద సెల్ఫీల హడావుడి కనిపించింది. ఆయన చేతిలో రూపుదిద్దుకున్న అంబేడ్కర్, రాజా రవి వర్మ, దామెర్ల రామారావు, ఆదికవి నన్నయ తదితర విగ్రహాలను జనం ఆశ్చర్యంగా తిలకించారు. పెయింటింగ్స్, ఆకృతుల ఖరీదు బాగా ఎక్కువగా ఉండడంతో చాలా మంది బేరమాడి వెనక్కు తగ్గారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కళాకారులను సత్కరించి... ఈ ప్రభుత్వం కళాకారులకు పూర్వవైభవం తీసుకొచ్చే దిశగా ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య సుప్రసన్నశ్రీ చిత్రకళా ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్పీ నరసింహకిషోర్ బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించి ఎప్పటికప్పుడు తగు ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 250 మంది సిబ్బంది, 6 సీసీ కెమెరాలు, రెండు డ్రోన్లను భద్రతా ఏర్పాట్లకు వినియోగించారు.



కళలకు పునరుజ్జీవం: శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణరాజు



రాజమహేంద్రవరం/సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కళలకు పునరుజ్జీవం దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని శాసనసభ ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన 'అమరావతి చిత్రకళా వీధి' ప్రదర్శనను ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రకాశనం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'చలనచిత్ర కళాకారులు కావచ్చు, నాటకరంగ కళాకారులు కావచ్చు.. కళాకారులంటే నాకు చాలా గౌరవం. అలాంటి ఈ శాఖకు దుర్గేశ్, తేజస్విలను ఎంపిక చేసిన రోజు కళలకు మంచి రోజులు వచ్చాయనే నమ్మకం కలిగింది. అది ఈ రోజు నిజమైంది. రానున్న రోజుల్లో వీరిద్దరి నాయకత్వంలో మరిన్ని గొప్ప గొప్ప కార్యక్రమాలు రాష్ట్రమంతా జరగాలి. కళాకారుల పట్ల ప్రజలకు ఉన్న అభిమానానికి ఇది మచ్చు తునకగా మిగిలింది. కళలను గౌరవించినచోట చక్కని వాతావరణం ఉంటుంది' అన్నారు. మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ... 'ఇవాళ చిత్రకళా వీధి అనే పేరుతో చైరపర్సన్ తేజస్విని, మేము ఒక ఆలోచన చేశాం. ఇక్కడ లబ్ధ ప్రతిష్టులైన అనేక మంది కళాకారులు ఉన్నారు. కేవలం చిత్రలేఖనమే కాకుండా శిల్పాలు తయారు చేసే కళాకారులూ ఉన్నారు. వీటిని ప్రజలకు తెలియజేయడం ద్వారా ప్రజల్లో కళల పట్ల ప్రత్యేకమైన ఆసక్తి కల్పించాలని భావించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్విని, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డి.మల్లికార్జునరావు కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కాగా నిర్వాహకులను, అధికారులను, వలంటీర్లను మంత్రి దుర్గేశ్ ప్రత్యేకంగా అభినందించారు. కళాకారుల వద్దకు వెళ్లి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేశారు.



చిత్రకళా వీధిలో ప్రదర్శనలను తిలకిస్తున్న జనం


తాను వేసిన చిత్రం గురించి చెప్తున్న కళాకారిణి




చిరుధాన్యాలతో ప్రధాని మోదీ చిత్రపటం


సొగసుచూడతరమా...


రాజాధిరాజ, రాజమార్తాండ.... ఆకట్టుకున్న చిత్రం


తమ ప్రాజెక్టులతో ప్రదర్శనకు వచ్చిన విద్యార్థులు


అచ్చుగుద్దినట్టు... పెన్సిల్ ఆర్ట్ కళాకారుల సందడి

జై జవాన్... జై కిసాన్ నినాదంతో చిత్రాలు

పి.రామారావు, బీఎస్ఎఫ్ జవాన్, ఛత్తీస్‌గఢ్ (స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా పలాస)



దేశాన్ని ముందుకు నడిపించడంలో అత్యంత కీలకమైన రంగాలు వ్యవసాయం, రక్షణ. అందుకే రైతులు, జవాన్లతో చాలా సంవత్సరాలుగా పెయింటింగ్‌లు వేస్తున్నాను.

చెక్కతో అనేక రకాల వస్తువులు

మంజునాథ్, ఉడ్ కళాకారుడు, రామ్‌నగర్ జిల్లా, కర్ణాటక



చెక్కతో అన్ని రకాల వస్తువులను తయారు చేస్తున్నాం. దేశవ్యాప్తంగా జరిగే ఎక్స్‌పోలలో ప్రదర్శనలకు పెడుతున్నాం. కర్ణాటకు నుంచి ఆహ్వానించడం ఆనందంగా ఉంది.

మేకతోలుతో కళాఖండాలు

మురళి, కళాకారుడు, నిమ్మలకుంట, ధర్మవరం మండలం, శ్రీసత్యసాయి జిల్లా



మేకతోలును ఇరవై రోజులు ప్రోసెస్ చేస్తే రూపం మారుతుంది. అప్పుడు తోలుబొమ్మ కళాఖండాలు తయారు చేస్తాను. టేబుల్ ల్యాంప్‌లు, వివిధ రకాల చిత్రాలు, తోరణాలు... ఇలా అనేక రకాల ఆకృతుల్లో పెయింటింగ్‌లు తయారు చేస్తున్నాం. మార్కెట్లో వీటికి డిమాండ్ అధికంగానే ఉంది.

ప్రధాని మోదీ పిలుపుతో మిల్లెట్ చిత్రాలు

మోకా విజయ్‌కుమార్, విశాఖపట్నం



ప్రధాని నరేంద్రమోదీ పిలుపుతో మిల్లెట్స్ ప్రాధాన్యాన్ని పెంచుతూ పెయింటింగ్‌లు వేయడం మొదలుపెట్టాను. ఇప్పటికి ఆరు అరుదైన రికార్డులను కైవసం చేసుకున్నాను. న్యూఢిల్లీ, హైదరాబాద్, విశాఖపట్నం -జీ20లో ప్రదర్శనలు ఇచ్చాను.

ఆదరణ బాగుంది

బత్తుల అర్చన, చిత్రకారిణి, తిరుపతి



ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్‌లో ఈ పెయింటింగ్ వేయడం మొదలుపెట్టాను. ఒక్కటి వేయడానికి రెండు రోజులు పడుతుంది. నా భర్త సహకారంతో 15 ఏళ్లగా పెయింటింగ్‌లు వేస్తున్నాను. ప్రజాదరణ బాగుంది.

నిండు గర్భిణి... అయినా అంతా తానై!

రాష్ట్ర సృతజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్. తేజస్విపై ప్రశంసల జల్లు

రాజమహేంద్రవరంలో తొలిసారిగా ఏర్పాటుచేసిన అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన ప్రశంసలు అందుకొంది. సుమారు 500 మంది కళాకారులు తమ పెయింటింగ్స్, ఆకృతులను ప్రదర్శించారు. ఈ నిర్వహణ ఒక్క రోజులో జరిగింది కాదు. ఎంతో కసరత్తు చేయడం వల్లే విజయవంతమైంది. దీని వెనుక ఒక మహిళ కృషిని అందరూ ప్రశంసిస్తున్నారు. ఆమే తేజస్వి పొడపాటి. రాష్ట్ర సృతజనాత్మకత, సంస్కృతి కమిషన్ ఛైర్‌పర్సన్. ప్రస్తుతం ఏడో నెల గర్భవతి. సాధారణంగా విశ్రాంతి తీసుకునే సమయం. కానీ బాధ్యతలను విస్మరించలేదు. మండు టెండను సైతం లెక్కచేయకుండా కార్యక్రమ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. చాలా రోజులుగా అధికారులతో, ప్రజాప్రతినిధులతో మాట్లాడు తూ సమన్వయం చేశారు. స్టాల్స్ ఏర్పాటు నుంచి వీఐపీల రాక వరకు అంతా తానై నడిపించారు. ఉదరంపై చేయి వేసుకుంటూ నెమ్మదిగా నడుస్తూనే అంతా చక్కబెట్టారు.


ప్రముఖ చిత్రకారుడు దామెర్ల రామారావు విగ్రహం వద్ద తేజస్వి




వేస్ట్ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు విగ్రహం

రెండు తరాలుగా వేస్ట్ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో....

కాటూరి వెంకటేశ్వరరావు, శిల్ప కళాకారుడు, తెనాలి



ఏడు తరాలుగా వంశపారంపర్యంగా విగ్రహాలు చేస్తున్నాము. గత రెండు తరాలుగా స్టెయిన్‌లెస్ స్టీల్ విగ్రహాలను తయారు చేస్తున్నాం. ఒక్కో విగ్రహం తయారీకి 45రోజులు నుంచి రెండు నెలలు పడుతుంది. కర్ణాటకలో పునీత్‌రాజ్‌కుమార్ విగ్రహాలు మేమే తయారు చేశాము. ఇప్పటివరకు కొన్ని వేల విగ్రహాలను తయారు చేశాను.

విగ్రహాలకు ప్రాధాన్యత పెరుగుతోంది

రాజ్‌కుమార్ వడయార్, ప్రముఖ శిల్ప కళాకారుడు

విగ్రహాలకు గతంలో కంటే ప్రాధాన్యత ఎక్కువైంది. మా పూర్వీకుల నుంచి నాకు ఈ కళ వారసత్వంగా వచ్చింది.

కనీసం మూడు రోజులు నిర్వహించాలి

ఎ.శ్రీనివాస్, రాజమహేంద్రవరం



ఈ ప్రదర్శన చాలా బాగుంది. పెయింటింగ్స్ అద్భుతంగా వున్నాయి. కనీసం మూడు రోజులైనా ఉంటే ఎక్కువ మంది చూసే అవకాశం ఉంటుంది.

తెలియని వాటిని తెలుసుకున్నాం

కృష్ణగౌతమ్, ఇంటర్ విద్యార్థి, రాజమహేంద్రవరం



చాలా పెయింటింగ్స్ ఎలా వేస్తారో తెలియదు. అటువంటి వాటిని తెలుసుకున్నాను. వీటితో కూడా కళాఖండాలు తయారు చేయవచ్చా అనిపించింది.

ఇటువంటి అద్భుత కళాఖండాలు చూడలేదు

హర్షిణి, రాజమహేంద్రవరం



ఈ ప్రదర్శనలో అద్భుతమైన కళాఖండాలు ఉన్నాయి. చిత్రకారులు గొప్పతనం వాటి తయారీ వెనుక కనిపిస్తోంది. వినియోగించి పడేసే సీసాలతో అద్భుత అవిష్కరణలు చేశారు. రావి ఆకుపై పెయింటింగ్స్ సూపర్.

వేసవి సెలవుల్లో పెడితే బాగుండేది

కె.భవాని, లాలాచెరువు



ఇక్కడి చిత్రాలు చూడ్డానికే కాదు విజ్ఞానానికి కూడా దోహదపడతాయి. వేసవి సెలవుల్లో పెడితే పిల్లలందరూ చూసే అవకాశం ఉండేది.

రాములోరి కల్యాణానికి కంత సారె

పి.గన్నవరంలో 16 ఏళ్లుగా శ్రీరామనవమికి తయారీ

పట్టాభిరామస్వామి ఆలయంలో సీతమ్మవారికి

సమర్పించనున్న భీమరాజు-సత్యవాణి దంపతులు


పాలకోవాతో తయారు చేసిన కంత సారె

పి.గన్నవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణానికి క్షత్రియ వివాహ సంప్రదాయాన్ని అనుసరించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం గ్రామానికి చెందిన పేరిచర్ల భీమరాజు-సత్యవాణి దంపతులు కంత సారె సమర్పిస్తున్నారు. వైనతేయ గోదావరి నదీ తీరాన వేంచేసియున్న పట్టాభిరామస్వామి ఆలయంలో ప్రతిఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా స్వామి, అమ్మవార్ల కల్యాణానికి కంత సారె సిద్ధం చేశారు. వరుడు (రాముడు) తరఫున వధువు (సీతమ్మతల్లి)కి పాలకోవతో తయారు చేసిన సుమారు 108 రకాల స్వీట్లు, పిండి వంటలు సమర్పించనున్నారు. నవమికి 15 రోజులు ముందు నుంచీ సుమారు 200 లీటర్ల పాలతో తయారు చేసిన కోవాను ఉపయోగించి పంచె, చీర, పర్ణశాల, వివిధ రకాల పండ్లు, కాయలు, వస్తువుల ఆకారాలు, గోవిందనామం, పల్లకి, శంఖు, చక్రాలను అందంగా తీర్చిదిద్దారు. ఇవే కాకుండా వివిధ రకాల పిండి వంటలను కూడా అధిక మొత్తంలో సిద్ధం చేశారు.



పట్టాభిరామస్వామి ఆలయానికి 70 ఏళ్ల చరిత్ర ఉంది. 16 ఏళ్లుగా మా కాలనీలోని మహిళల సహకారంతో స్వామివారి తరఫున అమ్మవారికి కంతసారె అందిస్తున్నాము. మొదట చిన్నగా ప్రారంభించి ప్రస్తుతం భారీ స్థాయిలో తయారు చేస్తున్నాం. కల్యాణం అనంతరం ఆలయానికి వచ్చే భక్తులకు సారెను పంచుతాం. **- సత్యవాణి**

భద్రాద్రి రాములోరి కల్యాణానికి మండపేట బొండాలు

25ఏళ్లుగా అందజేస్తున్న రామారెడ్డి దంపతులు

మండపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో జరిగే సీతారామచంద్రుల కల్యాణానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన కేవీ రామారెడ్డి దంపతులు కొబ్బరి బొండాలు తయారు చేశారు. వీటితో పాటు కర్పూర దండలు, తలంబ్రాలు పోసుకునే కొబ్బరి కురిడీలను కూడా అందజేస్తున్నామని ఆయన తెలిపారు. ఒంటిమిట్టలో ఈ నెల 11న జరిగే సీతారాము కల్యాణానికి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని గొల్లల మామిడాడ రామాలయం, వాడపల్లి వేంకటేశ్వరస్వామి కల్యాణం, రామతీర్థంతో పాటు పలు రామాలయాల్లో జరిగే కల్యాణోత్సవాలకు కొబ్బరిబొండాలను తయారు చేసి పంపిస్తున్నామని రామారెడ్డి చెప్పారు. బొండాలను శుక్రవారం ఆయన ఇంటిలోని సీతారాముల విగ్రహాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. వీటిని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చూసి రామారెడ్డి దంపతులను అభినందించారు.


కొబ్బరి బొండాలు తయారు చేసిన రామారెడ్డి దంపతులు



మృత్యువుతో పోరాడి.. ఓడి..

ఫార్మాసిస్ట్ నాగాంజలి మృతి

- కిమ్స్ బొల్లినేని ఉద్యోగి లైంగిక వేధింపులతో ఆత్మహత్యాయత్నం
- 13 రోజులు వైద్య చికిత్స
- రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో పోస్టుమార్టం, కుటుంబీకులకు అప్పగింత
- నాగాంజలి తండ్రికి వివిధ రాజకీయ పార్టీల నాయకుల పరామర్శ



నాగాంజలి మృతదేహాన్ని అంబులెన్సులోకి ఎక్కిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఒక్కగానొక్క కూతురు ... 12 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత పుట్టిన బిడ్డ. పేద కుటుంబమైనా ఎంతో అపురూపంగా చూసుకుని ఉన్నత చదువుల కోసం తపన పడి పట్టణం పంపిన ఆ తండ్రికి కుమార్తె మృతి తీవ్ర దుఃఖాన్ని మిగిల్చింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆసుపత్రి ఉద్యోగి లైంగిక వేధింపులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఫార్మాసిస్ట్ నల్లపు నాగాంజలి శుక్రవారం మృతిచెందింది. 13 రోజుల సుదీర్ఘ వైద్యచికిత్స అనంతరం తెల్లవారుజామున తుది శ్వాస విడిచింది. ఈ మేరకు నాగాంజలి మృతదేహానికి రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. పోస్టుమార్టం అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటన్నర సమయంలో ప్రైవేట్ అంబులెన్సులో స్వగ్రామమైన ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రౌతుగూడెం గ్రామానికి తరలించారు. నాగాంజలి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం, చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన అత్యంత సున్నితం కావడంతో ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద పోలీసులు భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆమె మృతదేహానికి పోస్టుమార్టం నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రికి వచ్చారు. నాగాంజలి తండ్రి దుర్గారావును పరామర్శించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన పార్టీ నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, ఐద్వా, మహిళా సంఘం నాయకులు తులసి, లావణ్య, ఇతర విద్యా, ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వ బోధనాసుపత్రికి చేరుకున్నారు. నాగాంజలి మృతదేహాన్ని అంబులెన్సులో తరలించే సమయంలో వామపక్షపార్టీల నాయకులు అరుణ్, మధు తదితరులు తీవ్ర నిరసన తెలిపారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పుట్టెడు దుఃఖంలో తండ్రి దుర్గారావు



చెట్టుకింద దిగాలుగా కూర్చున్న దుర్గారావు

ఆసుపత్రి వద్ద నాగాంజలి తండ్రి దుర్గారావు పరిస్థితి చూస్తే ఎవరికైనా కన్నీళ్లు పెట్టించకమానవు. నోటమాట రాని పరిస్థితుల్లో దిగాలుగా, దైన్యంగా ఎవరికీ చెప్పుకోలేక, బాధ ఆవేదనలను తనలోనే దిగమింగుకోలేని నిస్సహాయపరిస్థితుల్లో ఆసుపత్రి పోలీస్ అవుట్‌పోస్టు వద్ద నున్న చెట్టు కింద వేదనతో కూర్చోవడం అందరినీ కలచివేసింది. కూతురి మృతదేహానికి పోస్టుమార్టం జరుగుతుంటే తనవారెవరూ తోడు లేని పరిస్థితుల్లో దుర్గారావు తానొక్కడే మౌనంగా రోదిస్తూన్న స్థితి అత్యంత దయనీయంగా కనిపించింది. ఎవరెవరో నాయకులు రావడం, పరామర్శించడం, సంఘ పెద్దలు తోడుగా నిలవడం ... అవన్నీ దుర్గారావుకు కలగానే మిగులుతాయా అన్నట్టుగా అక్కడి పరిస్థితులు మారాయి.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

మా పాపకు జరిగిన అన్యాయం ఏ పాపకూ జరగకూడదు. వాడిని కఠినంగా శిక్షించాలి, ఏమైనా సరే నిందితుడిని కఠినంగా శిక్షించాల్సిందే. ఇది మా కోరిక. ప్రభుత్వం తరఫున మాకు అన్ని సహకారాలు అందుతున్నాయి. మా సంఘం తరఫున కూడా మంచిగానే చూస్తున్నారు అని నాగాంజలి తండ్రి దుర్గారావు తెలిపారు.

డిప్యూటీ సీఎం ఆదేశాలతో...

నాలుగు దశాబ్దాల సమస్యకు పరిష్కారం



పిఠాపురంలో ఎల్‌పీసీలు అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

పిఠాపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలుగా పిఠాపురంలోని రథాలపేటలో ఉంటున్న తమకు ఇళ్ల పట్టాలులేవని అక్కడ ప్రజలు ఆ ప్రాంతంలో పర్యటించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకురావడంతో సమస్యకు పరిష్కారం లభించింది. పవన్‌కల్యాణ్ ఆదేశాలతో ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న 15మందిని గుర్తించి వారికి రెవెన్యూ అధికారులు ఎల్‌పీసీలు జారీ చేశారు. శుక్రవారం కాకినాడ జిల్లా పిఠాపురంలో లబ్ధిదారులకు ఎమ్మెల్సీ నాగబాబు ఎల్‌పీసీ లు అందజేశారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ పవన్ రథాలపేటలో పర్యటించినప్పుడు సమస్యలు తెలియజేయగానే కుళాయి వేయించి తాగునీటి సమస్య పరిష్కరించారని, ఇప్పుడు పట్టాలు అందజేశారని తెలిపారు. అంతకుముందుకు సాంఘిక సంక్షేమశాఖ బాలికల సమీకృత వసతి గృహంలో రూ.36.5లక్షలతో నిర్మించిన ఆధునీకరణ పనులను, పాదగయ ఎదురుగా జేజీఆర్ గ్రూపు నిర్మించిన బస్‌షెల్టర్‌ను నాగబాబు ప్రారంభించారు. వసతిగృహంలో బాలికలతో ముచ్చటించారు. వసతులు, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరాతీశారు. కార్యక్రమంలో శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్, కౌడా చైర్మన్ తుమ్మల బాబు, జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌హన్, ఎస్పీ బిందుమాధవ్, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, భీమిలి జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ ఉన్నారు.

సోదరుడి పిండ ప్రదానానికి పయనమై

ప్రాణాలు విడిచిన సోదరులు

- లారీ ఢీకొని అన్నదమ్ముల మృతి
- గంగలకుర్రులో విషాదంలో మరో విషాదం



ఘటనా స్థలం వద్ద సోదరులను ఆసుపత్రికి తీసుకెళ్తున్న దృశ్యం

అంబాజీపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సోదరుడు మృతితో ఆ ఇంట్లో విషాదం నెలకొన్న పది రోజులకే మరో విషాదకరమైన ఘటన జరిగింది. సోదరుడు దశదిన కర్మ కార్యక్రమాలు నిర్వహించి పిండ ప్రదానానికి మోటార్‌సైకిల్ పై వెళ్తున్న అన్నదమ్ములను లారీ మృత్యురూపంలో కబళించింది. ఒకరు సంఘటనా స్థలంలోనే మృతిచెందగా మరొకరు చికిత్స పొందుతూ మృతిచెందారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రు గ్రామానికి చెందిన మంగిపూడి సూర్యనారాయణ గత నెల 24న మృతిచెందాడు. అతడి దిన కార్యక్రమాన్ని సోదరులు మంగిపూడి రామచంద్రరావు(67) మంగిపూడి నాగరాజు(64)లు శుక్రవారం ఇంటి వద్ద నిర్వహించారు. అనంతరం కర్మ కార్యక్రమాలు నిర్వహించి వాటిని కౌశికలో (గ్రామ శివారున ఓ కాలువ) కలిపేందుకు మోటార్‌సైకిల్‌పై అన్నదమ్ములు బయలుదేరివెళ్లారు. ఆ ఇంటికి సమీపంలోని గంగలకుర్రు ప్రాథమిక పాఠశాల నాలుగురోడ్ల జంక్షన్‌లోకి వచ్చే సరికి ముక్కామల నుంచి అంబాజీపేట వైపు అతివేగం, నిర్లక్ష్యంతో వెళ్తున్న లారీ మోటార్‌సైకిల్‌ను బలంగా ఢీకొంది. దీంతో నాగరాజు తలకు తీవ్రగాయాలు, రామచంద్రమరావుకు బలమైన గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్ ద్వారా అమలాపురం ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో నాగరాజు మృతిచెందగా రామచంద్రరావు చికిత్స పొందుతూ మృతిచెందాడు. నాగరాజుకు భార్య, కుమారుడు ఉన్నారు. నాగరాజు విజయవాడలో చార్టర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆయన భార్య ఇన్‌కంట్యాక్స్ కార్యాలయంలో అధికారిగా పనిచేస్తున్నారు. కాగా రామచంద్రరావుకు వివాహం కాలేదు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ కె.చిరంజీవి పరిశీలించారు. దిన కార్యక్రమం జరిగిన రోజే మరో విషాదం జరగడంతో గంగలకుర్రులో విషాదచాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు రోదిస్తున్న తీరు చూపరులను కలిచివేసింది. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. సీఐ రుద్రరాజు భీమరాజు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చిరంజీవి పేర్కొన్నారు.

సెంట్రల్ జైలులో పరిచయం..

ఇంటి తాళాలు బద్దలు కొట్టి దొంగతనం

ఒకరి అరెస్టు.. మరొకరి కోసం గాలింపు

రూ.15.48 లక్షల విలువైన 19 రకాల బంగారు ఆభరణాలు స్వాధీనం



సమావేశంలో మాట్లాడుతున్న కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణారావు, పోలీసు అధికారులు

అమలాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ జైలులో ఉన్న సమయంలో ఏర్పడ్డ పరిచయంతో తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాలోని ఓ దొంగను పోలీసులు అరెస్టు చేసి అతడి నుంచి రూ.15.48 లక్షల విలువైన 19 రకాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్‌లు మాట్లాడారు. ఈ వివరాలను ఎస్పీ వెల్లడించారు. రావులపాలెం మండలం లక్ష్మీపోలవరం గ్రామంలో ఫిబ్రవరి 22వ తేదీన రాత్రి సమయంలో దొంగలు ఓ ఇంటి తాళాలు బద్దల కొట్టి బంగారు వస్తువులను భారీగా చోరీ చేశారు. వాటిని అమ్మే క్రమంలో పోలీసులకు పట్టుబడ్డారు. పి.గన్నవరం మండలం మానేపల్లి గ్రామానికి చెందిన ఉండి శివసుబ్రహ్మణ్యంతో పాటు సెంట్రల్ జైలులో పరిచమైన పందిరి వెంకటనారాయణ ఇద్దరూ కలిసి లక్ష్మీపోలవరంలోని ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. అయితే వాటిలో కొన్ని వస్తువులను అమ్మేందుకు ప్రయత్నిస్తున్న ఉండి శివసుబ్రహ్మణ్యంను రావులపాలెం జూనియర్ కళాశాల సమీపంలో గల సర్వీసు రోడ్డులోని ఖాళీ స్థలంలో ఉండగా పాత నేరస్తుడైన సుబ్రహ్మణ్యాన్ని అదుపులోకి తీసుకుని అరెస్టుచేశారు. అతడి నుంచి రూ.15.48లక్షలు విలువైన 172.661 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో మరో నిందితుడైన పందిరి వెంకటనారాయణ కోసం గాలిస్తున్నట్టు చెప్పారు. ఈ కేసును చేధించడంలో కీలకంగా పనిచేసిన రావులపాలెం సీఐ ఎం.శేఖర్‌బాబు ఆధ్వర్యంలోని పోలీసు సిబ్బందికి రివార్డులు అందించారు. దర్యాప్తులో సహకరించిన హెచ్‌సీ ఎస్.సత్యనారాయణ, కానిస్టేబుల్ పి.త్రిమూర్తులు, సీహెచ్ శ్రీనుబాబు, జి.కృష్ణసాయి, సుంకర బైసన్‌జీవన్‌కు ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. రికవరీ చేసిన వస్తువులను డీఎస్పీ మురళీమోహన్ ప్రదర్శించారు.

చీటీల సొమ్ముతో ఉడాయించిన మహిళ

రూ.1.40కోట్లు మేర మోసం

పిఠాపురం పోలీసులను ఆశ్రయించిన బాధితులు



పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధిత మహిళలు

పిఠాపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): చీటీల సొమ్ముతో ఒక మహిళ ఉడాయించింది. మోసపోయిన బాధితులు శుక్రవారం రాత్రి కాకినాడ జిల్లా పిఠాపురం పోలీసుస్టేషన్‌కు తరలివచ్చి న్యాయం చేయాలని కోరారు. పిఠాపురంలోని కత్తులగూడెంకు చెందిన ఎం.కుమారి కొంతకాలంగా ప్రవేటుగా ఇంటి వద్ద చిట్‌ఫండ్ నిర్వహిస్తోంది. సుమారు 130 మంది వద్ద రూ.1.5లక్షల వంతున చీటీలు కట్టించుకుంది. అయితే కొంతకాలంగా చీటీల సొమ్ము సక్రమంగా చెల్లించకపోవడంతో మహిళలు ప్రశ్నించగా త్వరలోనే అందరికి సొమ్ములు చెల్లిస్తానని హామీ ఇచ్చింది. కొద్ది రోజులుగా ఆమె ఇంటి వద్ద కనబడకపోవడంతో మోసపోయామని గుర్తించిన మహిళలు శుక్రవారం రాత్రి పిఠాపురం పోలీసుస్టేషన్‌కు తరలివచ్చారు. సుమారు రూ.1.40 కోట్లు మేర చీటీల సొమ్ముతో కుమారి పరారయిందని మహిళలు తెలిపారు. తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

కొనసాగిన నాటికల పోటీలు

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.రాయవరంలో శ్రీరామచంద్ర నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐదోవ జాతీయస్థాయి నాటికల పోటీలు సందేశాత్మకంగా సాగుతున్నాయి. రెండోరోజు శుక్రవారం విశాఖపట్టణం తెలుగు కళాసమితి కళాకారులు ప్రదర్శించిన నీ ఖరీదెంత నాటిక, కొండెవరం మణికంఠ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన కొత్త తరం కొడుకుల నాటిక ఆకట్టుకున్నాయి.

పెళ్లింట తీవ్ర విషాదం

పెళ్లి షాపింగ్‌కి వెళ్లి వస్తుండగా యువకుడి మృతి

లారీ ఢీకొనడంతో ప్రమాదం



చిక్కాల శ్రీను (ఫైల్)



మృతదేహం

జగ్గంపేట రూరల్/ గండేపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పెళ్లింట తీవ్ర విషాదం నెలకొంది. మరో 15 రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. పెళ్లి షాపింగ్ నిమిత్తం వెళ్లి తిరిగి వస్తుండగా మృత్యువు కాటేసింది. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన చిక్కాల శ్రీను (28)కు గోకవరం మండలం మల్లవరానికి చెందిన అమ్మాయితో పెళ్లి నిశ్చయమైనట్టు తెలిసింది. పెళ్లి షాపింగ్ నిమిత్తం శుక్రవార పెద్దాపురం వెళ్లి తిరిగి వస్తుండగా జగ్గంపేట మండలం కాట్రావులపల్లి భారత్ పెట్రోల్‌బంక్ వద్ద వెనుక నుంచి లారీ ఢీకొనడంతో బైక్‌పై ఉన్న శ్రీను కిందపడగా తలకు గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పెళ్లి పనుల్లో కుటుంబంతా సంతోషంగా ఉన్న సమయంలో ఈ విషయం తెలియగానే ఒక్కసారిగా కుప్పకూలారు. అప్పటివరకు బంధుమిత్రులతో సంతోషంగా ఉన్న కుటుంబీకులు, ఇరుగుపొరుగు వారు కన్నీరుమున్నీరయ్యారు. 4రోజుల కిందటే పసుపు కొట్టడం జరిగిందని, ఇంతలోనే మృత్యు ఒడిలోకి శ్రీను చేరడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. శనివారం పుట్టిన రోజు జరుపుకోవాల్సిన శివ అకస్మాత్తుగా కన్నుమూయడంతో కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్నారు. శ్రీనుకు తండ్రి కాట మస్వామి, తల్లి సావిత్రి, సోదరి ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

కూతురిపై అత్యాచారయత్నం

భార్య ఫిర్యాదుతో నిందితుడిపై కేసు నమోదు

కరప, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కూతురు వరసైన యువతిపై అత్యాచారయత్నానికి ఒడిగట్టిన ఉదంతం కాకినాడ జిల్లా కరప మండలం వేళంగి గ్రామంలో జరిగింది. కరప పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. వేళంగి గ్రామానికి చెందిన మండాది అమ్మాజీకి ఒక అబ్బాయి, అమ్మాయి ఉన్నారు. అమ్మాజీ సోదరి చనిపోవడంతో 27ఏళ్ల ఆమె కూతురిని చేరదీసి తన ఇంట్లో ఉంచుకుంది. కాగా ఈనెల 3వ తేదీన ఇంట్లో ఎవరూలేని సమయం చూసి అ మ్మాజీ భర్త శ్రీనివాసు కూతురు వరస అయిన ఆ యువతిని బలత్కరించబోయాడు. దీంతో బెదిరిపోయిన ఆ యువతి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు అక్కడకు చేరుకుని తలుపులు కొట్టారు. విషయం బయటకు చెప్తే చంపేస్తానని సదరు యువతిని బెదిరించి అక్కడ నుంచి పారిపోయాడు. కొద్దిసేపటికి ఇంటికి వచ్చిన అమ్మాజీకి స్థానికులు జరిగిన విషయం చెప్పడంతో శుక్రవారం ఆమె కరప పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో నిందితుడిపై ఎస్ఐ తోట సునీత అత్యాచారయత్నం కింద కేసు నమోదు చేసి బాధితురాలిని వైద్యపరీక్షల నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వైసీపీ నుంచి సామర్లకోట చైర్‌పర్సన్ సస్పెండ్

సామర్లకోట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ జీ.అరుణను వైసీపీ నుంచి సస్పెండ్ చేస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వైసీపీ వ్యతిరేఖ కార్యకలాపాలకు చైర్‌పర్సన్ అరుణ పాల్పడుతున్నారని ఫిర్యాదులు రావడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు ఆ ఉత్తర్వుల్లో తెలిపారు. అలాగే సామర్లకోట మండలం జెడ్పీటీసీ ఎలిశెట్టి అమృత భర్త ఎలిశెట్టి సూర్యనారాయణ మూర్తిని కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.

చమురు వినియోగంలో 3వ స్థానంలో భారత్

- ఆయిల్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్ సలోమ యాండో
- జేఎన్టీయూకేలో ఫిపి స్టూడెంట్ చాప్టర్ 13వ వార్షిక సమావేశం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యాండో, వీసీ ప్రసాద్, అతిథులు

జేఎన్టీయూకే, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భారతదేశం చమురు వినియోగంలో 3వ స్థానంలో ఉందని, ప్రపంచవ్యాప్తంగా 13.2 బీవోఈ (బ్యారెల్ ఆఫ్ ఈక్వివాలెంట్) వినియోగిస్తుండగా భారత్‌లో 4.7 బీవోఈ వినియోగిస్తున్నారని ఆయిల్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్ సలోమ యాండో అన్నారు. జేఎన్టీయూ వర్సిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో యూసీఈకే కెమికల్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్ విభాగాలలోని జేఎన్టీయూకే ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పెట్రోలియం ఇండస్ట్రీ (ఫిపి) స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో 13వ వార్షిక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సలోమ యాండో, గౌరవ అతిథిగా ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్, అతిథిగా ఫిపి డైరెక్టర్ దేబ్ అధికారి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా జేఎన్టీయూకే ఫిపి స్టూడెంట్ చాప్టర్ అధ్యాపక సలహాదారుడు ప్రొఫెసర్ కేవీ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సలోమ యాండో మాట్లాడుతూ భారతదేశంలో 26 అవక్షేపణా బేసిన్లు ఉండగా మొత్తం 3.36 మిలియన్ల చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో వ్యాపించి ఉన్నాయని తెలిపారు. వీసీ ప్రసాద్ మాట్లాడుతూ కెమికల్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్ విద్యార్థులు రాష్ట్ర, దేశ అవసరాల మేరకు ఇంధన వనరులను ఉత్పత్తి చేసేలా నూతన ఆవిష్కరణలను చేపట్టాలని సూచించారు. కార్లు, ద్విచక్ర వాహనాల ఉత్పత్తిలో భారతదేశం ఎంతో ముందుందన్నారు. దేశంలోని 11 విద్యాసంస్థల నుంచి వచ్చిన ఫిపి స్టూడెంట్ చాప్టర్ ప్రతినిధులకు అతిథులు ఫ్లాగ్, బ్యాడ్జ్‌ను అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.బాలకృష్ణ, స్వర్ణకుమారి, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, మాజీ వీసీ పద్మరాజు, ఫిపి స్టూడెంట్ చాప్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

టిడ్కో అపార్ట్‌మెంట్ల సమస్యలన్నీ పరిష్కరిస్తాం

- ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

పిఠాపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): టిడ్కో అపార్ట్‌మెంట్ల సముదాయాల వద్ద ఉన్న సమస్యలన్నింటి యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామని ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్ తెలిపారు. కాకినాడ పిఠాపురం గోర్స రోడ్డులో ఉన్న టిడ్కో అపార్ట్‌మెంట్లలో ఉన్న సమస్యలతో అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అజయకుమార్ శుక్రవారం సాయంత్రం అక్కడ పర్యటించారు. అపార్ట్‌మెంట్లవాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నిలిచిపోయిన వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను ప్రారంభించామని తెలిపారు. డ్రైన్ సమస్యలకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనరు కనకారావుకు సూచించారు. పైప్‌లైన్ల లీకేజీలకు మరమ్మతులు నిర్వహిస్తామని చెప్పారు. తక్షణం జంగిల్ క్లియరెన్స్ చేయిస్తామని తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద పిఠాపురంలోనే అధిక అక్యుపెన్సీ ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మున్సిపల్ మంత్రి నారాయణ సూచనలకనుగుణంగా జూన్ నాటికి 80వేల టిడ్కో గృహాలను లబ్ధిదారులకు నూరుశాతం అప్పగిస్తామని తెలిపారు. వివిధ కారణాలతో ఖాళీ అయిన 10వేల అపార్ట్‌మెంట్లును కేటాయించేందుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఆయన వెంట పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి, మున్సిపల్ కమిషనరు కనకారావు, జనసేన నాయకుడు పిల్లా శివశంకర్ ఉన్నారు.



పిఠాపురంలో ప్రజలతో మాట్లాడుతున్న ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ కుమార్

బిర్యానీ కోసం వెళ్లి...

బైక్ ఢీకొని యువకుడి మృతి

మరొకరికి తీవ్రగాయాలు

గండేపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బిర్యానీ తినేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. గండేపల్లి ఎస్ఐ శివనాగ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామా నికి చెందిన బాడవుల కేదార్ మణికంఠ(21) రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. గురువారం రాత్రి తన స్నేహితులతో కలిసి కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం బిర్యానీ తినేందుకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా గండేపల్లి వచ్చేసరికి రాత్రి 9 గంటల సమయంలో ఎన్టీరాజాపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మోటార్‌సైకిల్‌పై స్పీడ్‌గా రాంగ్ రూట్‌లో వచ్చి మణికంఠ బైక్‌ను ఢీకొన్నాడు. మణికంఠను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. మరో యువకుడు విష్ణువర్ధన్‌కు గాయాలయ్యాయి. మృతుడి బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరేసుకున్న యువకుడు

కొవ్వూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక యువకుడు ఉరేసుకున్నట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామానికి చెందిన మట్టా చంద్రరావు, భార్య కళావతికి కుమార్తె, కుమారుడు మట్టా చంద్రశేఖర్(23) ఉన్నారు. కుమార్తెకు వివాహం అయ్యింది. కళావతి హైదరాబాద్‌లో ఇంటిపని చేస్తుంది. చంద్రశేఖర్ ఏపీ ఫైబర్‌నెట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం చంద్రరావు పొలం వెళ్లి సాయంత్రం 6 గంటలకు ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంటి లోపలికి వెళ్ళి చూసేసరికి కుమారుడు చంద్రశేఖర్ ఫ్యాన్‌కు ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ వేగులయ్య కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. అసరాగా ఉంటాడనుకున్న కొడుకు ఉరేసుకుని మృతిచెందడంపై తండ్రి బోరున విలపించడం అందరిని కంటతడిపెట్టించింది.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

ఏలేశ్వరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలోని కంబాలపాలెనికి చెందిన సిరిబోతుల లక్ష్మీ పార్వతి తర భర్త రామకృష్ణ కనిపించడం లేదని శుక్రవారం ఏలేశ్వరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్తను ఫారెస్టు అధికారులు చెట్లు కేసు విషయంపై రాజవొమ్మంగి అటవీశాఖ కార్యాలయానికి పిలిపించారని అప్పటి నుంచి కనిపించడం లేదని తెలిపింది. భర్త ఆచూకీ కోసం న్యాయస్థానంలో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసినట్టు చెప్పింది.

వైసీపీ భూముల రీసర్వేకు మహిళ బలి

తనకున్న భూమి ఆన్‌లైన్‌లో మరొకరి పేరు ఉండడంతో మనస్తాపం

గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ మృతి



మరణించిన సురేఖ

అనపర్తి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గత పాలనలో వైసీపీ చేపట్టిన భూముల రీసర్వేలో జరిగిన అవకతవకలకు తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన మహిళ బలైపోయింది. అనపర్తి అడిషనల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. అనపర్తికి చెందిన నల్లమిల్లి సురేఖ తండ్రి సబ్బెళ్ళ సుబ్బారెడ్డి తనకున్న రెండెకరాల పొలాన్ని కుమార్తె సురేఖ సహా నలుగురికి సమానంగా రాసి 2021లో రిజిస్ట్రేషన్ చేయించారు. ఇటీవల సుబ్బారెడ్డి పన్నులు చెల్లించేందుకు వెళ్లగా ప్రభుత్వ రికార్డులలో సురేఖ పేరున ఉండాల్సిన భూమి మరొకరి పేరుతో ఉండడంతో ఆమె మనస్తాపానికి గురైంది. దీంతో ఆమె గురువారం సాయంత్రం ఇంటిలో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో బంధువులు ఆమెను ప్రైవేటు ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందింది. సురేఖ భర్త భక్తుడు రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అడిషనల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

కాకినాడ

నేడు కొత్తపల్లి మండలంలో ఎమ్మెల్సీ నాగేంద్రబాబు పర్యటన

కొత్తపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలో శనివారం ఎమ్మెల్సీ కె.నాగేంద్రబాబు పర్యటించనున్నారు. మండల కేంద్రమైన కొత్తపల్లితోపాటు ఉప్పాడ, అమరవల్లిలో పల్లెపండుగ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభిస్తారని ఎంపీడీవో పి.రవికుమార్ చెప్పారు.

హెచ్ఐవీ నిర్మూలనకు మొబైల్ వాహనాలు

● జేసీ రాహుల్ మీనా



జెండా ఊపి మొబైల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో హెచ్ఐవీ నిర్మూలనకు మొబైల్ అవుట్ రీచ్ వాహనాల సేవలు దోహదపడతాయని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. కౌన్సెలింగ్, టెస్టింగ్ సేవలు విస్తరించే కార్యక్రమంలో భాగంగా భారతదేశం మొబైల్ ఐసీటీసీ హెచ్ఐవీ మొబైల్ వాహనాన్ని కాకినాడ కలెక్టరేట్‌లో ఆయన శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పారా మెడికల్ హెల్త్‌కేర్ ప్రొవైడర్ల బృందంతో కూడిన మొబైల్ వాహనం సమస్యాత్మక ప్రాంతాల్లో సేవలు అందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. దీనివలన హెచ్ఐవీపై అవగాహన, చికిత్సలకు సత్వర అవకాశం ఉంటుందన్నారు. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ కష్టతరమైన ప్రాంతాలలో తాత్కాలిక క్లినిక్‌ను ఏర్పాటుచేయడానికి మొబైల్ సేవలు ఉప యోగపడతాయన్నారు. రోగనిరోధకత, పరీక్షలు, హెచ్ఐవీ కౌన్సెలింగ్ చేపట్టవచ్చునన్నారు. వాహనంలో ఒక కౌన్సిల ర్, ల్యాబ్‌టెక్నీషియన్, అటెండర్‌లు ఉంటారన్నారు. కార్యక్రమంలో వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించే వరకూ పవన్ వదిలిపెట్టరు

● జగ్గయ్యచెరువు కాలనీవాసుల సమస్యలకు త్వరలో పరిష్కారం
● పిఠాపురంలో ఎమ్మెల్సీ నాగబాబు



జగ్గయ్యచెరువు కాలనీలో గృహకల్ప అపార్ట్‌మెంటు వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నాగబాబు

పిఠాపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా స్పందించే నాయకుడు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్. అలాంటిది తన సొంత నియోజకవర్గం పిఠాపురంలో ప్రజలకు ఏ చిన్న సమస్య రానివ్వరు. సమస్య ఉంది అంటే పరిష్కారమయ్యే వరకూ వదిలిపెట్టరని ఎమ్మెల్సీ కొణిదల నాగబాబు అన్నారు. పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో రాజీవ్‌గృహకల్ప అపార్ట్‌మెంట్లువద్ద అపార్ట్‌మెంట్, కాలనీవాసులతో శుక్రవారం సాయంత్రం ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఏళ్ల తరబడి రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సౌకర్యం లేక అవస్థలు పడుతున్నామని మహిళలు వివరించారు. రోడ్లు వేయకుండా బిల్లులు చేసుకున్నారని నాగబాబు దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం నాగబాబు మాట్లాడుతూ సమస్యలు చెప్పడం ప్రజల హక్కు, ప్రజాప్రతినిధులుగా పరిష్కరించడం మా బాధ్యత అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై పవన్ ప్రత్యేకంగా దృష్టి సారించారని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు ఆయన ప్రతినిధులుగా తాము వచ్చామని శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ తెలిపారు. సమస్యలపై అధ్యయనంచేసి నివేదిక సమర్పించమని ఆదేశించారని, త్వరలోనే ఒక అధికారిక బృందం వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్, కౌడా చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, పిఠాపురం మునిసిపల్ కమిషనరు కనకారావు తదితరులు ఉన్నారు.

పాలిటెక్నిక్ ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభం

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో శ్రీమ్ అపర్ణా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించే పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఉచిత శిక్షణా తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు శిక్షణకు 120మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు., శిక్షణను ట్రస్ట్ చైర్మన్ ఆకొండి వెంకటేశ్వరశర్మ ప్రారంభించగా, సభ్యులు బత్తుల భద్రం, తుమ్మూరి శ్రీరామారావు, ఉపాధ్యాయులు దాసం శ్రీనివాస్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు టెక్ట్స్ బుక్స్ పంపిణీ

పిఠాపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి: ఇంటర్మీడియట్ సెకండియర్ తరగతులను వేసవి సెలవులకు ముందుగానే ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం వారికి టెక్ట్స్‌బుక్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత టెక్ట్‌బుక్స్‌ను పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.కేశవరావు విద్యార్థులకు అందజేశారు.

ఈనెల 30లోపు పన్ను చెల్లిస్తే 5శాతం రిబేటు : కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి శుక్రవారం జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం 2025-26 సంవత్సరానికి సంబంధించిఆస్తి పన్నులను ఈనెల 30వతేదీలోపు ఒకేసారి చెల్లిస్తే వారు ఆస్తిపన్నుపై 5శాతం రిబేట్ పొందవచ్చని కమిషనర్ భావన తెలిపారు. ఈనెలాఖరులోపు చెల్లించే వారికి మాత్రమే ఈ రిబేటు అందుతుందన్నారు. ప్రస్తుతం 2025-26 సంవత్సరానికిగాను ఈఆర్‌పీ అప్లికేషన్‌లో డిమాండ్ నోటీసులు జనరేట్‌చేసే ప్రక్రియ జరుగుతుందని ప్రక్రియ పూర్తవ్వగానే ఈనెల 7 నుంచి ప్రజలు పన్ను చెల్లించి 5శాతం రిబేట్ పొందవచ్చన్నారు. నగర ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

కౌడా పీవోగా సత్యనారాయణరాజు



కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కౌడా) పీవోగా సీహెచ్ సత్యనారాయణరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రాజమండ్రి కార్పొరేషన్‌లో పనిచేసిన ఆయన బది లీపై కౌడాకి వచ్చారు. ఇప్పటికే పీవోగా శ్రీని వాసరావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన త్వరలో పదవీ విరమణ చేయబోతున్నారు. దీంతో రెండో పీవోగా సత్యనారాయణరాజును నియమించారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పలువురు సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు

● కాకినాడ ఆర్డీవో మల్లిబాబు

కాకినాడసిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ చేసే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు స్పష్టం చేశారు. కాకినాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం వైద్య, ఆరోగ్య, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ, డివిజన్‌స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం ఆర్డీవో మల్లిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐవో డాక్టర్ కెవీ సుబ్బరాజు మాట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సం బంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టామన్నారు. కాకినాడ డివిజన్‌స్థాయిలో గుర్తింపు పొందిన 116 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు సక్రమంగా నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో జీజీహెచ్ రేడియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఇందిరా శ్రీశైలజ, డాక్టర్ డి.విజయ్‌ప్రదీప్, వన్‌టౌన్ ఏఎస్ఐ సీహెచ్ నరసింహరావు, కె.సింహాద్రి, యూత్ వలంటరీ ఆర్గనైజేషన్ ఎన్‌జీవో ఎం.శివకుమార్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన కార్యదర్శులకు సత్కారం



కార్యదర్శులను సత్కరిస్తున్న దృశ్యం

కరప, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం బదిలీ అయిన ఆరుగురు కార్యర్శులను సత్కరించారు. మండలంలోని గొడ్డటిపాలెం, పాతర్లగడ్డ, వాకాడ, వలసపాకల, వేళంగి, జి.బావారం పంచాయతీల్లో గ్రేడ్-5 కార్యదర్శులుగా పనిచేస్తున్న త్రిమూర్తులు, సుధాకర్, సునీల్, విజయలక్ష్మి, సంతోష్, శర్మలకు గ్రేడ్-4 కార్యదర్శులుగా పదోన్నతి లభించి వేరే గ్రామాలకు బదిలీపై వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో వారందరినీ ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, ఈవోపీఆర్డీ సలాది శ్రీనివాసరావు, ఏవో బీఎల్ నరసింహులు ఘనంగా సత్కరించారు. అలాగే బదిలీపై ఇక్కడకు వచ్చిన పలువురు కార్యదర్శులను అభినందించారు. సర్పంచ్‌లు గోన అనూష ఆంజనేయులు, సవిలే నీలిమరాజేష్, అడబాల సత్యప్రసాద్, నాగిరెడ్డి ఏసుబాబులు, కార్యదర్శుల సంఘం ప్రతినిధులు పినిశెట్టి వీరభద్రరావు, బ్రహ్మానందరావుపాల్గొన్నారు.

పిల్లలపై అరాచకాలు బాధాకరం

● రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కాకినాడ గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో బాలల హక్కులు, బాలల రక్షణ సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న బాలబాలికల రక్షణ కోసం కమిషన్ పనిచేస్తుందన్నారు. పిల్లలందరూ స్నేహపూరిత వాతావరణలో ఎదగడమే వారి ఆశయమని తెలుపుతూ మన రాష్ట్రంలో పిల్లలపై జరుగుతున్న అరాచకాలు చూస్తుంటే చాలా బాధ అనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ నుంచి డీవైఈవో, ఎంఈవో రవి, పోలీసుశాఖ నుంచి ఎస్ఐ, జిల్లాల బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకట్రావు, బాలల సంరక్షణాధికారులు కె.శ్రీనివాస్, జె.విజయ, లీగల్ ఆఫీసర్ ఎం.సుధాకర్, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

కాకినాడరూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పంపిణీచేసిన పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఐఈవో కేఎస్‌వీఎస్ ఏసుబాబు తెలిపారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతుల రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు డీఐఈవో చేతులమీదుగా అచ్చుపుస్తకాలు, ప్రాక్టికల్ రికార్డులు, నోట్ పుస్తకాలను శుక్రవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను, మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నదని, ఎంపికచేసిన కళాశాలల్లో ఇంజనీరింగ్, మెడికల్ చదవాలనే విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ అందిస్తున్నదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు ఈ సౌకర్యం కల్పించారని ఈనెల 7నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ప్రవేశాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ కంఠంలో ఇళ్లు నిర్మించుకున్నవారికి పట్టాలు

కొత్తపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలో వివిధ గ్రామాల్లో ఉన్న ఎటువంటి హక్కుపత్రాలు లేకుండా గ్రామ కంఠాల్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసే కార్యక్రమం చేపట్టిందని తహసీల్దార్ జి.చిన్నారావు చెప్పారు. ముఖ్యంగా గ్రామ కంఠాల్లో పత్రాలు లేకుండా గృహాలు కట్టుకున్న వాళ్లకి జీవో ఎంఎస్ నెం.30 ద్వారా పట్టాలు మంజూరు చేస్తారన్నారు. గ్రామాల్లో ఎవరైనా గ్రామకంఠాల్లో (అభ్యంతరంలేని స్థలాల్లో) ఇళ్లు నిర్మించుకున్నట్టయితే ఈనెల 10 తేదీలోగా గ్రామ రెవెన్యూ అధికారి ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మహిళలకు నూతన వస్త్రాల పంపిణీ

సర్పవరంజంక్షన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో శుక్రవారం అడబాల ట్రస్ట్ అధ్యక్షుడు రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. రిటైర్డ్ ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు, రాజా ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

అలయన్స్ క్లబ్ కాకినాడ శరవణ కార్యవర్గం

కాకినాడసిటీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అలయన్స్ క్లబ్ కాకినాడ శరవణ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం స్థానిక వెంకట్‌నగర్‌లోని శ్రీనివాస అపార్ట్‌మెంట్‌లో అలయన్స్‌క్లబ్ కాకినాడ శరవణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా దిలీప్ కుమార్ సదనాని వ్యవహరించారు. క్లబ్ అధ్యక్షుడిగా యాళ్ల రత్నారావు, కార్యదర్శిగా డి.రామకృష్ణ, కోశాధికారిగా దామిసెట్టి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. సమావేశంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 12 మందికి జరిమానాలు, జైలు

సామర్లకోట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారన్న సమాచారంతో సామర్లకోట పోలీసులు తనిఖీలు నిర్వహించి 12 మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సామర్లకోట పోలీసులు తెలిపారు. వీరిని శుక్రవారం కాకినాడ మూడో అదనపు జెఎఫ్‌సీఎం కోర్టు ఎదుట హాజరుపర్చగా 7గురు వ్యక్తులకు రెండురోజుల చొప్పున జైలుశిక్ష, ఐదుగురికి ఒక్కొక్కరికీ రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి డీ. శ్రీదేవి తీర్పునిచ్చినట్లు సీఐ శ్రీకృష్ణభగవాన్ శుక్రవారం రాత్రి తెలిపారు.

'ఎస్సీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'

● ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. శుక్రవారం గొడారిగుంటలో ప్రధాన మంత్రి షెడ్యూల్డ్ కులాల అభ్యుదయ యోజన (పీఎం అజయ్) స్కీమ్ కింద మంజూరైన రూ. 4 లక్షల చెక్కుని నలుగురు ఎస్సీ మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత స్వయం సంవృద్ధి సాధించేందుకు పీఎం అజయ్ పథకం దోహదం చేస్తుందన్నారు. అదనపు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా ఎస్సీ వర్గాలకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు పెంచడం ద్వారా పేదరికాన్ని తగ్గించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. వెలుగు ఏపీఎం సత్యనారాయణ, పార్టీ నాయకులు కరెడ్ల గోవిందు, మాదారపు తాతాజీ, బందారు మురళీ, దాసరిశివ, రాము, వెంకటరమణ పాల్గొన్నారు.



మహిళలకు రూ. 4 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నానాజీ

పోలీసు అధికారులు, సిబ్బందికి పవన్ అభినందనలు

పిఠాపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాదగయ క్షేత్రంలో జరిగిన మహాశివ రాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలుగకుండా బందోబస్తు ఏర్పాట్లులో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందిని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అభినందించారు. వారికి ప్రత్యేకంగా ప్రశంసాపత్రాలు పంపారు. వీటిని గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పవన్‌కల్యాణ్ నివాసంలో శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ నాగబాబు పోలీసు అధికారులు, సిబ్బందికి అందించి సత్కరించారు. కార్యక్రమంలో శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'పట్టణ సుందరీకరణకు అధిక ప్రాధాన్యం'

పెద్దాపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణ సుందరీకరణకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక జగ్గంపేట రహదారిలో ఉన్న గుర్రాల సెంటర్ వద్ద ఐ లవ్ పెద్దాపురం డిజిటల్ బోర్డును ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దాపురం, సామర్లకోట జంట పట్టణాల సుందరీకరణకు ప్రత్యేక ప్రణాళికలను రూపొదించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు), టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, కూటమి నేతలు పాల్గొన్నారు.

'అణగారిన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ కృషి'

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : దేశ స్వాతంత్య్రం, విద్యారంగం, అణగారిన వర్గాల అభ్యున్నతికి బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయని అక్కూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్ ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ రూరల్ తిమ్మాపురం అక్కూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించాలి

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాబోయే బీజేపీ ఆవిర్భావ దినోత్సవం, అంబేద్కర్ జయంతి కార్యక్రమాలను మండల స్థాయిలోను, క్షేత్రస్థాయిలో ఘనంగా నిర్వహించడం కోసం జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అధ్యక్షతన జిల్లా ప్రధాన కార్యదర్శులు పార్టీ మండల ప్రెసిడెంట్స్, పార్టీ నాయకులతో కీలక సమావేశం శుక్రవారం కాకినాడ ప్రకృతి ఆశ్రమంలో జరిగింది. బీజేపీ సీనియర్ నాయకులు మాలకొండయ్య, భావన ప్రసాద్, పెద్దిరెడ్డి రవికిరణ్ పాల్గొన్నారు.

వేట్లపాలెంలో రీ సర్వే గ్రామసభ

● 450 అభ్యంతరాల స్వీకరణ

సామర్లకోట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా సామర్లకోట మండలం వేట్లపాలెంలో సుమారు 45 రోజులపాటు 50మంది సర్వేయర్లు, 25మంది వీఆర్వోలు నిర్వహించిన భూముల రీసర్వే గ్రామసభ శుక్రవారం వేట్లపాలెం రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాలులో తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 5వేల ఎకరాల భూములను సర్వే బృందాలు రీసర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామ సభలలో 450మంది రైతులకు చెందిన తమ భూముల నమోదులలో తేడాలున్నట్లు గుర్తించి తహశీల్దార్‌కు ఫిర్యాదులు చేశారు. శనివారం నుంచి సర్వేయర్లు, వీఆర్వోలు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి రైతుల సమస్యలకు నివృత్తి చేస్తామని తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డి స్పష్టం చేశారు.

ప్రభుత్వ బడులు..విద్యార్థుల జీవితాలకు వెలుగులు

కరప, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కరప మండలం నడకుదురు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వాకాడ వెంకటరమణ తమ పాఠశాలలో అడ్మిషన్ల కోరుతూ రూపొందించిన ఈ కరపత్రం పలువురిని ఆలోచింపజేస్తుంది. ప్రభుత్వబడి విశిష్టత, ప్రత్యేకతలతోపాటు తల్లికి వందనం, మనబడి-మనభవిష్యత్, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యాపథకం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాలను కరపత్రంలో పొందుపరిచి పలువురు తల్లిదండ్రులకు అందజేస్తున్నారు. ప్రభుత్వ బడులవల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ తమ పిల్లలను ఇక్కడ చేర్పించాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలల మోజులో పడి లక్షలాది రూపాయలను ఖర్చుచేస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో అంతకుమించి విద్యాబోధన, సౌకర్యాలు ఉన్నాయని హెచ్ఎం వెంకటరమణ తెలిపారు. తల్లిదండ్రుల్లో చైతన్యం కలిగించడానికి ఈ కరపత్రాన్ని రూపొందించామన్నారు. డీఈవో సూచనల మేరకు కొన్ని మార్పులు చేసిన ఈ కరపత్రాన్ని ఇటీవలె జిల్లాకు వచ్చిన మంత్రి నారాయణ ఆవిష్కరించినట్లు ఆయన చెప్పారు.

నిరుపయోగంగా ఉన్న మార్కెట్ షెడ్‌ల పరిశీలన

కరప, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కాజులూరుమండలం గొల్లపాలెంలో నిరుపయోగంగా ఉన్న మార్కెట్ షెడ్‌లను శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ జి.శ్రీనివాసులు పరిశీలించారు. స్థానిక మార్కెట్‌సెంటర్‌లోని పంచాయతీ స్థలంలో 2009లో డీఆర్‌డీఏ నిధులు వెచ్చించి ఈ షెడ్‌లను నిర్మించారు. అయితే నిర్మాణాలు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా నేటికీ అవి ప్రారంభానికి నోచుకోలేదు. నిరుపయోగంగా ఉన్న ఈ షాపులను ప్రారంభిస్తే వస్త్ర వ్యాపారం చేసుకుంటామంటూ గొల్లపాలెం, ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు కలంకారీ వ్యాపారులు అధికారులకు విన్నవించుకున్నారు. ఈ క్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసులు, మార్కెట్ షెడ్‌లను పరిశీలించి త్వరలోనే వేలంపాట ద్వారా వ్యాపారులకు లీజుకు ఇస్తామని హామీ ఇచ్చారు. మాజీసర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, మండల గౌడసంఘం అధ్యక్షుడు అంగర కృష్ణ, కడలి రాంపండు, కొల్లు హనుమంతరావు, పలువురు కలంకారీ వ్యాపారులు పాల్గొన్నారు.

సిద్ధి వినాయకుడికి ఇత్తడి మకరతోరణం



గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని రజకపేటలో ఉన్న సిద్ధి వినాయక స్వామి ఆలయంలో స్వామికి ఆకొండి ప్రభాకరశాస్త్రి, వెంకట సూర్యలక్ష్మి, డాక్టర్ నిమిష పూర్ణ, నాగ అపర్ణలు ఇత్తడి మకరతోరణం అందజేశారు. అనంతరం స్వామికి అలంకరించారు. వేదపండితుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన



పెద్దాపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మరిడమ్మ దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. వేకువజామున నిత్యకైంకర్యాలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గర్భగుడి నుంచి ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు. మండపంలోని ప్రత్యేక వేదికపై అమ్మవారిని అధిష్టింపచేసి వేదపండితుల పవిత్ర మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ పురం విజయలక్ష్మి, ఆలయ సిబ్బంది, వేద పండితులు పాల్గొన్నారు.

పెద్దాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మంగలక్ష్మి



పెద్దాపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్‌గా పెద్దాపురం మండల ఆర్బీ కొత్తూరు గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నేత నూనే రామారావు సతీమణి నూనే మంగలక్ష్మి ఎంపికయ్యారు. ఈ మేరకు టీడీపీ అధిష్టానం నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. మెట్ట గ్రామానికి చెందిన మంగలక్ష్మికి ఏఎంసీ చైర్మన్ పదవి దక్కడంతో పలువురు సంతోషం వ్యక్తం చేశారు. ఏఎంసీ చైర్మన్‌గా ఎన్నికైన మంగలక్ష్మిని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు), మండల టీడీపీ అధ్యక్షుడు కొత్తెం వెంకట శ్రీనివాసరావు(కోటి)తో పాటు కూటమి నేతలు అభినందించారు.

ఆక్వా జోన్ల ఏర్పాటుకు గ్రామసభలు

కరప, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం కరపమండల గ్రామాల్లో ఆక్వాజోన్ల ఏర్పాటుకు గ్రామసభలు నిర్వహించనున్నట్టు కాకినాడ మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఆర్.నూకరాజు తెలిపారు. ఈనెల 7న అరట్లకట్ట, జడ్.బావారం, గురజనాపల్లి, ఉప్పలంక, జి.బావారం, సిరిపురం గ్రామాల్లోను, 8న కొరుపల్లి, కరప, పెనుగుదురు, నడకుదురు, పెద్దాపురప్పాడు, గొర్రిపూడి గ్రామాల్లోను, 9న వేములవాడ, వేళంగి, కొంగోడు, పాతర్లగడ్డ గ్రామాల్లోను, 11న కూరాడ, చినమామిడాడ, యండమూరు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి

● సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ సాగర్

కాకినాడ సిటీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ మోకా ఆనందసాగర్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం ముందుగానే రబీ పంట ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన సంచులు, ట్రాన్‌పోర్ట్, టార్పాలిన్స్ వంటివి సమకూర్చిందన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్లు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కలిగిస్తున్నారన్నారు.

పిఠాపురం ఎక్సైజ్ స్టేషన్ మార్పు

పిఠాపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పిఠాపురం శివారులో ఆర్వోబీ దాటిన తర్వాత చిత్రాడ రోడ్డులో ఉన్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజు స్టేషన్‌ను మార్పు చేశారు. పట్టణంలోని సీతయ్యగారితోటలో గల తులిజాభవన్‌లోకి శుక్రవారం నుంచి మార్పుచేసినట్లు పిఠాపురం ఎక్సైజ్ సీఐ శివరామరాజు తెలిపారు.

రుణాల మంజూరుకు సహకరించాలి

గొల్లప్రోలు రూరల్ ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసేందుకు సహకరించాలని గొల్లప్రోలు ఎంపీడీవో కర్రి స్వప్న కోరారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

తొండంగి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తొండంగిలో శ్మశానవాటి అభివృద్ధి పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. లోతట్టు ప్రాంతంలో ఉండి అంతిమ సం స్కారాలకు ఇబ్బందికరంగా ఉన్న శ్మశానాన్ని ఒంటిమామిడి దివిస్ ఫార్మా కంపెనీ సహకారంతో రూ.3.5లక్షలతో మెరక చేసే పనులు చేపట్టారు. పనులు ప్రారంభించిన సర్పంచ్ సోమాల ప్రసాద్ మాట్లాడుతూ దివిస్ యాజమాన్యం పెద్ద మనసుతో చేపట్టిన పని వల్ల గ్రామానికి ప్రయోజనం చేకూరుతుందన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

గ్రామసభలో నిర్వాసితుల ఆందోళన


కూనవరంలో నిర్వాసితులతో మాట్లాడుతున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్

కూనవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం జరిగిన పోలవరం ఆర్అండ్ ఆర్ గ్రామసభలో కొంత మంది అర్హులు తమ పేర్లు రాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. టేకుల బోరు, శబరికొత్తగూడెం, పెద ఆర్కూర్, టేకుబాక గ్రామాల్లో పోలవరం గ్రామసభలు నిర్వహించారు. తాము ఇక్కడే పుట్టి ఇక్కడే ఉ న్నా, అన్ని అర్హతలు కలిగి వున్నా పేర్లు తొలగించారని కొంతమంది నిర్వాసితులు అధికారుల ముందు వాపోయారు. సుమారు 21 సంవత్సరాలుగా వెళ్లిపోయిన వారిని సైతం అర్హులుగా గుర్తించారని టేకులబోరు గ్రామసభలో నిర్వాసితులు తెలిపారు. ఉపాధి కోసం చాలా మంది బయట ప్రాంతాలకు వెళ్లారని, అలాంటి వారిని అర్హులుగా గుర్తించలేదన్నారు. టేకులబోరులో గ్రామసభను ఇరుకు ప్రాంతంలో నిర్వహించడంతో నిర్వాసితులు అధికారులకు సరైన సమాధానం చెప్పుకోలేకపోయారు. త్వరలోనే కూనవరంలో ఆర్అండ్ఆర్ గ్రామసభ నిర్వహించనున్నారు. చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని తెలిపారు. అనర్హుల జాబితాలో వచ్చిన వారికి మరొకసారి గ్రామసభ నిర్వహిస్తామన్నారు. ఆ సభలో అర్హత పత్రాలన్నీ అందజేస్తే వాటిని పరిశీలించి అర్హులుగా గుర్తిస్తామని చెప్పారు.

దర్భతాళ్లగూడెంలో...

వీఆర్పురం: మండలంలోని వడ్డిగూడెం గ్రామ పంచాయతీ దర్భతాళ్లగూడెంలో శుక్రవారం పోలవరం అధికారులు ఆర్అండ్ఆర్ గ్రామసభ నిర్వహించారు. చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ మాట్లాడుతూ నిర్వాసితులందరికీ న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం 253 మంది నిర్వాసితుల పేర్లను పంచాయతీ డిజిటల్ అసిస్టెంట్ జె.నాగేశ్వరరావు చదివి వినిపించారు. పోలవరం అధికారులు (ఎస్డీసీ) బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామంలో ఎవరు పేర్లు రాకపోయినా గ్రామసభలో దరఖాస్తు ఇవ్వాలన్నారు. నిర్వాసితులందరికీ ప్రభుత్వం పరిహారం అందిస్తుందన్నారు. ఎటపాక తహసీల్దారు సుబ్బారావు, వడ్డిగూడెం పంచాయతీ కార్యదర్శి ఏవీవీ రమణ, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, నిర్వాసితులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

● ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన తన చాంబరులో గిరిజన సంక్షేమశాఖ అధికారులు, ఎంఈవోలు, ఏకలవ్య రెసిడెన్షియల్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ, జిల్లా పరిషత్, జీపీఎస్, మండల పరిషత్, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారు. ఇంకా ఎంతమంది కావాలో మండలాలవారీగా నివేదికలు తయారు చేసి అందజేయాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి నిర్మించిన సెల్ టవర్లు పనిచేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, డీఈవో వై.మల్లేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, ఏటీడబ్ల్యూవోలు రామతులసి, కృష్ణమోహన్, ఎంఈవోలు రామకృష్ణ, సత్యనారాయణ, వై.వెంకన్న, టి.సూరారెడ్డి, తాతబ్బాయి దొర, ముత్యాలరావు, ఢిల్లీ చైతన్య, ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ శంకర్ప్రసాద్, గురుకులం సెల్ అధికారి నాగేంద్ర, అర్చన రమణి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

గండిపోశమ్మను దర్శించుకున్న ఐటీడీఏ పీవో


పీవో కుటుంబానికి అమ్మవారి చిత్రం పటం అందిస్తున్న దృశ్యం

దేవీపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందూరులో స్వయంభు శ్రీగండి పోశమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు సందర్భంగా అమ్మవారిని శుక్రవారం రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. పీవోకు అధికారులు అమ్మవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

మండలంలోని సీతారాం కాలనీలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు హాజరై సీతారాములను దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.

సినీఫక్కీలో కడుపు నాటకం

● పిల్లలులేక లేని కడుపును ఉన్నట్లు భర్తను నమ్మించిన భార్య
● అర్ధరాత్రి అదృశ్యం -కాకినాడలో ప్రత్యక్షం
● నిజం నిగ్గు తేల్చిన పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): చాలా కాలంగా పిల్లలు లేని ఒక మహిళ తన భర్త బాధచూడలేక సినీఫక్కిలో గర్భం దాల్చినట్లు నాటకమాడింది. ఆ నాటకానికి ఫుల్స్టాప్ పెట్టేందుకు మరొక నాటకం ఆడి అడ్డంగా బుక్కైంది. ఈసంఘటన రాజమహేంద్రవరంలో ప్రారంభమై కాకినాడలో ముగిసింది. రాజమహేంద్రవరం త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే. దేవీపట్నం మండలం ఇందుకూరుపేటకు చెందిన కొప్పిశెట్టి లోవరాజు కొప్పిశెట్టి సంధ్యారాణి భార్యాభర్తలు వీరికి వివాహమై 27 ఏళ్లు అయ్యింది. అయితే ఎంతకీ పిల్లలు పుట్టకపోవడంతో కుటుంబీకులంతా చాలా బాధపడేవారు. చుట్టుపక్కల వారు కూడా గర్భం రావడంలేదని గుసగుస లాడుకోవడంతో దీంతో ఆ బాధలు తట్టుకోలేక తనకు గర్భం వచ్చినట్లు కుటుంబ సభ్యులను నమ్మించింది. అప్పటి నుంచి తన భర్తను తీసుకుని నెలనెలా రాజమహేంద్రవరం వచ్చి జయకిడ్నీ కేర్ ఆసుపత్రికి తీసుకుని రావడం లోపలికి వెళ్లి ప్రెగ్నెన్సీ రావడానికి గల కారణాలను డాక్టర్ను అడిగిరావడం గర్భం వచ్చి బాగానే వున్నట్లు భర్తను నమ్మించడం చేసేది. ఈనేపథ్యంలో గత నెల31న ఆసుపత్రికి వచ్చిన సంధ్యారాణి ఆసుపత్రిలోకి వెళ్లి బయటకు వచ్చి తనకు ఈనెల 3న డెలివరీడేట్ ఇచ్చారని నమ్మించి ఇంటికివెళ్లిపోయింది. అన్నట్లుగానే ఈనెల 3న ఉదయం 11గంటలకు భర్తతో కలిసి జయకిడ్నీకేర్కు తీసుకువచ్చి ఇక్కడ డెలివరీ నాటకం ఆడితే తెలిసిపోతుందని భర్తకు కనిపించకుండా ఆసుపత్రి బయటకు వచ్చి తిరిగి ఇందుకూరుపేట వెళ్లి ఆటోలో కాకినాడ వెళ్లిపోయిందని పోలీసులు తెలిపారు. ఎవ్వరో గుర్తుతెలియని వ్యక్తులు ఇద్దరు తనను ఎత్తుకుపోయారని తనకు ఇద్దరు కవల పిల్లలు పుట్టారని ఎవ్వరో ఎత్తుకు పోయారని భర్తకు పోను చేసి మరో కొత్తనాటం ఆడింది. ఆసుపత్రి వద్ద అదృశ్యమైన తన భార్య సంధ్యారాని కనిపించడంలేదని వెంటనే లోవరాజు స్థానిక త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో త్రీటౌన్ సీఐ అప్పారావు, ఎస్ షేక్ సుభానీలు అప్రమత్తమై కాకినాడలో విచారణ చేసి సంధ్యారాణిని పట్టుకున్నారు. అప్పుడు పోలీసుల విచారణలో వాస్తవాలు బయటకు వచ్చాయి. అస్సలు సంధ్యారాణికి గర్భంరాలేదని పిల్లల కోసం తన భర్త, కుటుంబ సభ్యులను నమ్మించడానికి నాటకం ఆడిందని తెలుసుకున్న పోలీసులు సంధ్యారాణికి ఆమె కుటుంసభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చి ఆమెను కుటుంబానికి అప్పగించారు. అదృశ్యం కేసు నమోదు చేసిన గంటలో చాకచక్యంగా వ్యవహరించి చేధించిన త్రీటౌన్ సీఐ,ఎస్ఐలను ఎస్పీ నరసింహకిషోర్ అభినందించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రాష్ట్ర ప్రభుత్వంలోనే సంక్షేమం, అభివృద్ధి: ఎమ్మెల్యే


మురారిలోసీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గండేపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సంక్షేమం, అభివృద్ధి పనులు జరుగుతున్నాయని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ అన్నారు. శుక్రవారం మురారి, గండేపల్లి, మల్లేపల్లి, సుబ్బయ్యమ్మపేట గ్రామాల్లో రూ.2.46కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రోడ్లన్నీ ఎక్కడికక్కడ అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే రోడ్లన్నీ నిర్మించి రాజమార్గాలుగా మార్చామన్నారు. ఇప్పటికే జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల్లో రూ.25కోట్లతో రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. బీటీ రోడ్డు రూ.5.60కోట్లతో నిర్మించామన్నారు. గోకవరం మండలంలో రూ.11కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. మురారి గుబ్బాలమ్మ గుడి నుంచి హైస్కూల్కు వెళ్లే రోడ్డు, మల్లేపల్లి నుంచి ఎన్టీరాజాపురం వెళ్లే రోడ్డు, గండేపల్లి కొత్తపేటలో నిర్మించిన రోడ్డు, సుబ్బయ్యమ్మపేటలో రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, యువ నాయకులు జాస్తి వసంత్, కందుల చిట్టిబాబు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు సుంకవిల్లి రాజు, అడబాల భాస్కరరావు, కుంచే రాజా, వెలమాటి కాశీ, బొల్లంరెడ్డి రామకృష్ణ, వెంపాటి సతీష్, వెంపాటి రాజు, ఇప్పిర్ల బాబి, సుంకవిల్లి రమేష్, తెలగరెడ్డి భద్రరావు, దిడ్డి చిన్నశ్రీను, కొల్లి త్రిమూర్తులు, తెలగరెడ్డి ప్రకాశ్, కాటేపల్లి వీరభద్రం, వల్లభశెట్టి కోటి, మాజీ సర్పంచ్ బొండా శ్రీనుబాబు, ఎంపీడీవో నాతి బుజ్జి, పంచాయతీ రాజ్ జేఈ నారాయణ, ఏపీవో రాజు, ఈసీ రమేష్ పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేసే ప్రభుత్వం

చిత్తశుద్ధితో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఆయన మురారిలో విలేకరులతో మాట్లాడారు. సూపర్సిక్స్ పథకాలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని కొంతమంది అజ్ఞానులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, నిజాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. దీపం పథకం ద్వారా మూడు సిలెండర్లు ఇస్తున్నామని, పాఠశాలలు తెరిచేసరికి తల్లికివందనం, ఇప్పటికే పరిశ్రమలు నెలకొల్పేందుకు చర్యలు జరుపుతున్నామని ఇవన్నీ సూపర్ సిక్స్ పథకాల్లో భాగం కాదా అని, ఇవి తెలుసుకోవాలన్నారు. ఒక పార్టీకి జారబడేందుకు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, యువనాయకులు జాస్తి వసంత్, కందుల చిట్టిబాబు, అడబాల భాస్కరరావు, కుంచే రాజా తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

ఏలేశ్వరం, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి పురస్కరించుకుని ఏలేశ్వరం నుంచి భద్రాచలానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ జి.వి.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3గంటలకు, సాయంత్రం7గంటలకు, ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు, సాయంత్రం 5గంటలకు ప్రత్యేక ఆల్ట్రా బస్సులు బయలుదేరతాయన్నారు. రిజర్వేషన్ కోసం డిపో ప్రాంగణంలో బుకింగ్ కౌంటర్ను సంప్రదించాలని కోరారు.

రైతుల అభ్యున్నతే ధ్యేయం

ఏలేశ్వరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. శుక్రవారం లింగంపర్తి, భద్రవరం, పేరవరం, సిరిపురం, మర్రివీడు గ్రామాల్లో వ్యవసాయ అధికారిణి జ్యోతి నేతృత్వంలో రైతులకు సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుజ్జి ప్రారంభించారు. తహశీల్దార్ ఆనంద్ కుమార్, టీడీపీ మండలాధ్యక్షులు సూతి బూరయ్య, కొప్పుల బాబ్జి, బస్వా ప్రసాద్, జ్యోతుల పెదబాబు, జిగటాపు సూరిబాబు, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నాగబాబును కలిసిన తుమ్మలపల్లి



జగ్గంపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన కొణిదల నాగబాబు తొలిసారి పిఠాపురం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా జనసేన పార్టీ జగ్గంపేట ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్ శుక్రవారం నాగబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. పిఠాపురం ఇన్చార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, తుమ్మలపల్లి చందు, మాదారపు వీరబాబు, గోకేడ ప్రసాద్, రాము, కాయల మణికంఠ, పాలెం బాబీ పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయుడికి ఉత్తమ గురు పురస్కారం

కిర్లంపూడి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఉగాది నంది పురస్కారోత్సవ కార్యక్రమంలో కిర్లంపూడి మండలం సోమవరం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్, తెలుగు ఉపాధ్యాయుడు నాదేలి కన్నబాబు(కవిశ్రీ) మంత్రి కందుల దుర్గేష్ నుంచి ఉత్తమ గురు పురస్కారం అందుకున్నారు. కన్నబాబు 2018లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2019లో జిల్లా ఉత్తమ పౌర సేవా పురస్కారం, 2022లో జిల్లా ఉత్తమ తెలుగు ఉపాధ్యాయ అవార్డు, 2023లో ఉత్తమ గురు పురస్కారం అందుకున్నారు.

ధ్వజ దివ్య ప్రతిష్ఠ

రౌతులపూడి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మల్లంపేటలో రామాలయం వద్ద శుక్రవారం పూజ్యం నాగేశ్వరశర్మ మంత్రోచ్చారణల మధ్య ధ్వజ దివ్య ప్రతిష్ఠా మహోత్సవం జరిగింది. రెండు రోజులు యాగశాల ప్రవేశం, పుణ్యాహవచనాలు నిర్వహించారు. ఆలయాన్ని సినీనటుడుఆర్.నారాయణమూర్తి నిర్మించారు.

'సంస్కృతీ సంప్రదాయాలతోనే మానవుడి మనుగడ


సిరిపురంలో యజ్ఞ పూజలు చేస్తున్న దృశ్యం

ఏలేశ్వరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మానవుని మనుగడ సంస్కృతీ, సంప్రదాయాలతోనే ముడిపడి ఉందని లక్ష్మీనర్సాపురం స్వామి సూర్యానంద, గండేపల్లి ఆశ్రమ స్వామీజీ ప్రసాద్ వరణ్యే అన్నారు. సిరిపురం శ్రీచిద్గగనానంద గీతాశ్రమంలో నిర్వహించిన 51వ రాష్ట్ర స్థాయి భక్తి, జ్ఞాన, వేదాంత మహాసభల్లో చివరి రోజు కార్యక్రమానికి వివిధ ఆశ్రమాలకు చెందిన స్వామీజీలు హాజరై గురుదేవుని ఊరేగింపు, అమృత శిలావిగ్రహ పూజ, హోమాలు, గీతా పారాయణ, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సిరిపురం గీతాశ్రమం స్వామీజీ సాధు మహేష్, ఆశ్రమ కార్యదర్శి నడిశెట్టి తిరుపతిరావు, రాసంశెట్టి రాజా, ఆకుల నూకాపతిరావు, గుణిమానికుల రమణ, చిక్కం సత్యనారాయణ దంపతులు, ఆశ్రమ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తతో సంపద సృష్టి: డీఎల్పీవో


సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్పీవో


గండేపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్త వేరుచేసి చెత్త సేకరణ వాహనాల్లో వేయాలని డీఎల్పీవో బాలామణి తెలిపారు. సూరంపాలెంలో శుక్రవారం ఆమె ఇంటింటా తిరిగి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా వేరు చేసి రిక్షాల్లో వేస్తే సంపద కేంద్రాలకు తరలించి సంపద సృష్టించడానికి ఉపయోగపడతాయన్నారు. గ్రామంలో సంపద కేంద్రాన్ని పరిశీలించారు. పంచాయతీ సిబ్బందికి పారిశుధ్య నివారణపై పలు సూచనలు చేశారు. ఇంటి, కుళాయి పన్నులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యదర్శి బి.సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

వైసీపీలో వర్గపోరు!

తోట నరసింహం, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు వర్గీయుల మధ్య ఘర్షణ

జగ్గంపేట, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట గ్రామంలో శుక్రవారం రాత్రి వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కాపవరపు వెంకటరమణ ఇంటి వద్దకు జ్యోతుల చంటిబాబు వర్గీయులు అయిన జగ్గంపేటకు చెందిన బండారు రాజా వర్గీయులు వచ్చి కాపారపు రమణపై దౌర్జన్యం చేశారు. వివరాల్లోకి వెళితే వారం రోజుల నుంచి జగ్గంపేట వైసీపీ ఇన్చార్జ్ తోట నరసింహం, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు వర్గీయుల మధ్య సోషల్మీడియాలో అనేక రకమైన పోస్టింగ్లు పెట్టుకోవడంతో ఇవికాస్త తారాస్థాయికి చేరుకున్నాయి. కాపారపు వెంకటరమణ, జ్యోతుల చంటిబాబు జగ్గంపేటఉపసర్పంచ్ బండారు రాజాలపై అనుచిత వ్యాఖ్యలతో పోస్టింగ్లు పెట్టడంతో దీంతో చంటిబాబు, బండారు రాజా వర్గీయులు కాపారపు రమణ ఇంటి వద్దకు వచ్చి అతన్ని కాలర్ పట్టుకుని కొట్టడంతో పాటు నానా దుర్భాషలాడినట్లు రమణ తెలియజేశాడు. అదే విధంగా వారం రోజుల నుంచి మాజీ ఎమ్మెల్యే చంటిబాబు, బండారురాజాపై అనేక ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టింగ్లు పెట్టడంతో రాజా వర్గీయులు ఈఅనుచిత పోస్టులు పెట్టడంపై అడగటానికి వెళితే రమణ దుర్భాషలాడటంతో కొంత తోపులాట జరిగినట్లు జ్యోతుల చంటిబాబు వర్గీయులు తెలియజేస్తున్నారు. దీంతో విషయం తెలుసుకున్న వైసీపీ ఇన్చార్జ్ తోట నరసింహం రమణ ఇంటికి వచ్చి వివరాలు తెలుసుకుని తన పార్టీ కార్యకర్తలకు తాను అండగా ఉన్నానని తెలియజేస్తూ, దీనిపై తగు చర్యలు తీసుకోనున్నట్టు రమణ తెలిపాడు. ఏది ఏమైనప్పటికీ తోటనరసింహం వర్సెస్ జ్యోతుల చంటిబాబు తారా స్థాయి వర్గపోరు ప్రారంభమ వ్వడంతో ఇది ఎటు వైపు నుంచి ఎలా వెళుతుందనే దానిపై వైసీపీ క్యాడర్లో సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ చైర్మన్గా బద్ది మణి



ప్రత్తిపాడు/శంఖవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్గా బద్ది మణి నియమితులయ్యారు. శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన బద్ది మణి 2014-19 కాలంలో శంఖవరం మండల పరిషత్ అధ్యక్షులుగా పనిచేశారు. తొలుతగా 2006లో టీడీపీ ఎంపీటీసీగా ఎన్నికయ్యారు. ఆమె భర్త బద్ది రామారావు శంఖవరం టీడీపీ మండలాధ్యక్షుడిగా సుదీర్ఘకాలంగా కొనసాగుతున్నారు. రామారావు 17ఏళ్లు నెల్లిపూడి గ్రామ సర్పంచ్గా కొనసాగారు. ఐదేళ్లు కత్తిపూడి బ్యాంకు సొసైటీ డైరెక్టర్గా సేవలందించారు. అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యులుగా పని చేశారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు బద్ది మణి, రామారావు, రమణ, రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. మణికి టీడీపీ కాకినాడ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, సీబీఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ల జగదీష్,ఉల్లివీరభద్రరావు అభినందనలు తెలిపారు. బద్ది మణి ఎంపిక పట్ల సీనియర్ టీడీపీ నేత పర్వత సురేష్, బద్ది రమణ, కీర్తి వెంకట సుభాష్, పోలం చిన్నా, కర్రి శివాజీ, ఈగల దేవుళ్ళు పిర్ల అప్పారావు హర్షంవ్యక్తం చేశారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

శంఖవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతీ మహిళకు తడి, పొడి చెత్తను వేరే చేయడంపై అవగాహన కల్పించాలని డీఎల్పీవో ఎం.బాలామణి పేర్కొన్నారు. బుధవారం కత్తిపూడి, శంఖవరం గ్రామాల్లో పర్యటించిన ఆమె మహిళలకు అవగాహన కల్పించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు.

పీహెచ్సీల్లో మెరుగైన వైద్యం అందించాలి: పీవో


సమావేశంలో మాట్లాడుతన్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని పీహెచ్సీల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన వివిధ శాఖల అధికారులతో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వ్యాధు ల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మాతా, శిశు మరణాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలన్నారు. డిప్యూటీ డైరక్టర్ రుక్మాండయ్య, డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏటీడబ్ల్యూవోలు రామతులసి, కృష్ణమోహన్, సీడీపీవోలు సంధ్యారాణి, ప్రసన్న, లక్ష్మీ, దేవమణి పాల్గొన్నారు.

మల్లవరం గ్రామాన్ని సందర్శించిన మెడికల్ అధికారి


చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ ప్రజ్ఞ

మోతుగూడెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రజ్ఞ సుమారు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ గ్రామాన్ని సందర్శించారు.ప్రజలు ఆరోగ్య కేంద్రానికి రాకపోవడం, అనారోగ్య పరిస్థితులపై అప్రమత్తతలేకపోవడంతో ఈ విజిట్ నిర్వహించారు. 3 సంవత్సరాల చిన్నారి జ్వరంతో బాధపడుతూ చెట్టుకింద పడుకుని ఉండగా పరిశీలించి మలేరియా పాజిటివ్గా గుర్తించారు. తల్లికి తడిసిన గుడ్డతో శరీరం తుడిచే విధానాన్ని విధానం వివరించారు. గ్రామస్తులను సముదాయంగా కలుసుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నపాటి లక్షణాలు కనిపించినా వెంటనే పీహెచ్సీకి వచ్చి వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పీహెచ్సీ సిబ్బంది ఉన్నారు.

పాలిసెట్కు ఉచిత శిక్షణ

ఎటపాక, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30న నిర్వహించే పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉచిత శిక్షణతోపాటు ఉచిత స్టడీ మెటీరియల్ అందజేయనున్నట్లు ఎటపాక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జమ్ము రామసత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాలలో ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తునున్నట్లు తెలిపారు.

ఎన్సీడీ-సీడీ సర్వే పరిశీలన

శంఖవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యాధులను కట్టడి చేసేందుకు ఎన్సీడీ-సీడీ సర్వే నిర్వహిస్తున్నట్టు ఆర్బీఎస్కే ప్రాజెక్టు అధికారి ప్రభాకరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆసుపత్రిని పరిశీలించిన ఆయన సర్వేపై వివరాలు అడిగి తీసుకున్నారు. సర్వే నిర్వహించి ప్రజలకు వచ్చే వ్యాధులను ముందుగానే గుర్తించడమే కాకుండా వైద్యం అందించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. వైద్యులు సత్యనారాయణ, రాజీవ్ ఉన్నారు.

'ఆదిత్య'లో అంతర్జాతీయ సదస్సు

గండేపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఇంజనీరింగ్ అనువర్తనాల అల్గారిథమ్లు, గణన సిద్ధాంతం అనే అంశం మీద ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఘనంగా ప్రారంభమైంది. వివిధ దేశాలు, రాష్ట్రాలకు చెందిన అనేక మంది అభ్యర్థులు పాల్గొన్నారు. మొదటి రోజు సదస్సులో ఐఐటీ హైదరాబాద్లో ఈమెరిటస్ ప్రొఫెసర్గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బి.యజ్ఞనారాయణ, ది యూనివర్శిటీ ఆఫ్ న్యూకేసిల్ ఆస్ట్రేలియాలో విజిటింగ్ ప్రొఫెసర్గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఆసాది శ్రీనివాసులు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రౌతులపూడి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, టీడీపీ మండలాధ్య క్షుడు తమరాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఇంటశెట్టి సూర్య భాస్కరరావు అన్నారు. స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతులకు 40శాతం సబ్సిడీపై పవర్ టిల్లర్స్ను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు, నాయకులు ఎంపీటీసీ బీజా రాజు, హైస్కూల్ చైర్మన్ షేక్ సలీం, ఆసుపత్రి డైరక్టర్ బండారు సత్తిబాబు, జెట్లా రాజా పైల వేణుగోపాల్, కోరుప్రోలు బుజ్జిబాబు నాయుడు పాల్గొన్నారు.

తుని ఏఎంసీ చైర్మన్గా అంకంరెడ్డి రమేష్



తుని రూరల్/ కోటనందూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తుని ఏఎంసీ చైర్మన్గా కోటనందూరు మండలం కేఈ చిన్నయ్యపాలేనికి చెందిన అంకంరెడ్డి సత్య వెంకట సూర్యనారాయణ (రమేష్) నియమితులయ్యారు. రమేష్ తుని టీడీపీలో కీలక నాయకుడిగా ఉంటూ టీడీపీ జిల్లా అధికార ప్రతినిధిగా, బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా, మాజీ సర్పంచ్గా పని చేశారు. తుని ఏఎంసీ చైర్మన్గా రమేష్ నియామకం పట్ల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రమేష్ మాట్లాడుతూ తమ నేత యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య చొరవతో ఏఎంసీ పదవిని కేటాయించడంపై కృతజ్ఞతలు తెలిపారు. రమేష్ను టీడీపీ కోటనందూరు మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు, పెంటకోట భాస్కరసత్యనారాయణ, డి.చిరంజీవిరాజు, షేక్నవాబ్ జానీ, పెనుముచ్చు నాగేశ్వరరావు, గొర్లి అచ్చియ్యనాయుడు, పోతలసూరిబాబు అంకంరెడ్డి బుల్లిబాబు అభినందించారు.

40 నీటితొట్టెలకు అనుమతులు

శంఖవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలో 40 నీటితొట్టెల నిర్మాణానికి అనుమతులు వచ్చినట్టు టీడీపీ నేత పర్వత సురేష్ తెలిపారు. శుక్రవారం శంఖవరంలో ఏపీడీ భ్రమరాంబతో కలిసి నీటి తొట్టెల పనులకు శంకుస్థాపన చేశారు. భ్రమరాంబ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉపాధి పనులు త్వరితగతిన ప్రారంభించి పది గంటలకు ముగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి నిధులతో నీటితొట్టెలు వేగంగా నిర్మించి వేసవిలో అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సర్పంచ్ బందిలి గన్నియ్యమ్మ, చింతంనీడి కుమార్, బొర్రా లచ్చబాబు, బొర్రా వాసు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం

అన్నవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్రజపాలు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పాల్గొన్నారు.